RNI : APTEL/25/A0108

# మహి న్యూస్

www.mahinewsindia.com

MAHI NEWS

epaper: https://epaper.mahinewsindia.com

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

మహి న్యూస్

ఆంధ్రప్రదేశ్‌లో వెలువడుతున్న మహి న్యూస్ తెలుగు దినపత్రికకు ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ, మండలాల విలేకరులు కావలెను. తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలను రాయగలిగి ఉన్న వారికి, వార్తలను టైపు చేయగలిగి ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

-: సంప్రదించండి :-

9059585898

ఆంధ్రప్రదేశ్,తెలంగాణ. సంపుటి : 01 సంచిక : 336, ఎడిటర్ : నీలి రామసుబ్బయ్య, పేజిలు : 8, వెల రూ. 5, /- శనివారం - 14 - మార్చి - 2026

published From : YSR Kadapa. circulated by Kurnool I Anantapuram I Chitoor I East & West Godavari I Guntur I Krishna I Nellore I Srikakulam I Visakhapatnam I Vijayanagaram I Prakasham & Hyderabad and Telangana

## రాష్ట్రంలో భారీగా
# భూ కేటాయింపులు

- పరిశ్రమలు, విద్యాలయాలకు పెద్దపీట
- ముగిసిన ఏపీ క్యాబినెట్ భేటీ
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రివర్గం పలు కీలక నిర్ణయాలకు ఆమోదముద్ర వేసింది
- ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జల జీవన్ మిషన్, పోలవరం ప్రాజెక్టు పనుల వేగవంతం
- కడప స్టీల్ ప్లాంట్ ఏర్పాటు దిశగా ప్రభుత్వం మరో ముందడుగు
- గిరిజన రైతులకు సబ్సిడీలు, మహిళల కోసం హాస్టళ్లు వంటి అనేక ముఖ్యమైన ప్రతిపాదనలను ఆమోదం
- మిషన్ శక్తి పథకం కింద రాష్ట్రంలో ఉద్యోగాలు చేసే మహిళల కోసం 'సఖీ నివాస్' పేరుతో 30 వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్లను ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయం



**అమరావతి :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రివర్గం పలు కీలక నిర్ణయాలకు ఆమోదముద్ర వేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జల జీవన్ మిషన్, పోలవరం ప్రాజెక్టు పనుల వేగవంతం, కడప స్టీల్ ప్లాంట్‌కు భూ కేటాయింపులు, గిరిజన రైతులకు సబ్సిడీలు, మహిళల కోసం హాస్టళ్లు వంటి అనేక ముఖ్యమైన ప్రతిపాదనలను ఆమోదించారు. సమావేశం అనంతరం రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు కేబినెట్ - మిగతా 2 లో

## ఇక 24 గంటలూ
# షాపులు ఓపెన్..!




- ఏపీ వ్యాపారులకు గుడ్ న్యూస్
- ఏపీలోని ప్రధాన ప్రాంతాల్లో 24 గంటలూ షాపుల నిర్వహణకు అనుమతి
- సులభతర వాణిజ్యంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం కీలక ఉత్తర్వులు
- ఉద్యోగులకు వారానికి 48 గంటల పని, ఓవర్ టైం చెల్లింపు తప్పనిసరి
- 20 మందికి పైగా సిబ్బంది ఉన్న సంస్థలకు లైఫ్ టైమ్ రిజిస్ట్రేషన్ అవకాశం




## ఏపీ హైకోర్టు జడ్జిగా
# జస్టిస్ లిసా గిల్


- ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ లిసా గిల్ ప్రమాణస్వీకారం
- లిసా గిల్ తో ప్రమాణస్వీకారం చేయించిన చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్
- హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టనున్న జస్టిస్ లిసా
- న్యాయరంగంలో జస్టిస్ లిసాకు అపారమైన అనుభవం

## ఈశాన్యంలో
# బీజేపీతోనే శాంతి

- కాంగ్రెస్‌వి అన్నీ స్వార్థంతో చేసుకున్న ఒప్పందాలే: మోదీ
- రెండు రోజుల అసోం పర్యటనలో ప్రధాని మోదీ
- రూ.4,570 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శ్రీకారం
- మూడు కొత్త రైలు సర్వీసులకు జెండా ఊపిన ప్రధాని
- ఈశాన్య రాష్ట్రాల్లో శాశ్వతంగా శాంతిస్థాపనకు బీజేపీ చర్యలు
- బాంబు పేలుళ్లు, తుపాకీ కాల్పుల మోతలు గతంలో ఈశాన్య రాష్ట్రాల్లో వినిపించేవని, కానీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలు వచ్చాక ఇక్కడి పరిస్థితి మారిపోయిందని ఆయన తెలిపారు



**ఢిల్లీ :** ఈశాన్య రాష్ట్రాల్లో శాశ్వతంగా శాంతిస్థాపనకు బీజేపీ చర్యలు చేపట్టిందని, కానీ స్వార్థ ప్రయోజనాల కోసం కాంగ్రెస్ పార్టీ వివిధ ఒప్పందాలు చేసుకుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆరోపించారు. బాంబు పేలుళ్లు, తుపాకీ కాల్పుల మోతలు గతంలో ఈశాన్య రాష్ట్రాల్లో వినిపించేవని, కానీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలు వచ్చాక ఇక్కడి పరిస్థితి మారిపోయిందని ఆయన తెలిపారు. ఇప్పుడు అసోం రాష్ట్రం శాంతి, అభివృద్ధిలలో కొత్త అధ్యాయాన్ని లిఖిస్తోందన్నారు. అసోంలోని - మిగతా 2 లో




# వారిని అంతం చేస్తున్నా

- ఇరాన్‌కు మరోసారి డొనాల్డ్ ట్రంప్ హెచ్చరిక
- ఇరాన్ నౌకాదళం ఇప్పటికే కనుమరుగయ్యిందని, ఇక వైమానిక దళం కూడా ఉండదని హెచ్చరించారు
- అక్కడి పాలకులు 47 ఏళ్లుగా అమాయకులను పొట్టన పెట్టుకున్నారని ఆరోపించారు

## ఇజ్రాయెల్ వార్నింగ్ ఇచ్చిన
# కాసేపటికే భారీ పేలుడు

- ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో భారీ పేలుడు
- పాలస్తీనాకు మద్దతుగా భారీ ఎత్తున నిర్వహిస్తున్న 'కుద్స్ డే' ర్యాలీలో ఊహించని విధంగా తీవ్ర విస్ఫోటనం
- హెచ్చరికలు జారీ చేసిన కొద్దిసేపటికే ఈ ఘటన జరగడం గమనార్హం
- పవిత్ర రంజాన్ మాసం చివరి శుక్రవారం సందర్భంగా పాలస్తీనాతో సంఘీభావం తెలుపుతూ ఇరాన్ ప్రజలు ఈ నిరసనలు



**ఢిల్లీ :** ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో భారీ పేలుడు చోటుచేసుకుంది. పాలస్తీనాకు మద్దతుగా భారీ ఎత్తున నిర్వహిస్తున్న 'కుద్స్ డే' ర్యాలీలో ఊహించని విధంగా తీవ్ర విస్ఫోటనం సంభవించింది. ఇజ్రాయెల్ సైన్యం బహిరంగంగా హెచ్చరికలు జారీ చేసిన కొద్దిసేపటికే ఈ ఘటన జరగడం గమనార్హం.దాడికి ముందు ఇజ్రాయెల్ సైన్యం తమ అధికారిక పెర్షియన్ (ఫార్సీ) సోషల్ మీడియా ఖాతా ద్వారా మూడు మ్యాప్‌లను పంచుకుంది. టెహ్రాన్‌లోని చహర్రా-ఇ వెలియాస్ర్, మేయ్దాన్-ఇ తౌహిద్, విల్లాస్ ప్రాంతాలను ఎరుపు రంగుతో మార్క్ చేసింది. ఈ ప్రాంతాల్లో ఉన్న ప్రజలు వెంటనే సురక్షిత ప్రదేశాలకు వెళ్లాలని, త్వరలోనే దాడులు జరుగుతాయని చాలా స్పష్టమైన హెచ్చరికలు జారీ చేసింది. ఈ హెచ్చరికలు వెలువడిన కొద్ది సమయానికే, టెహ్రాన్ యూనివర్సిటీ వైపు వెళుతున్న కుద్స్ డే ర్యాలీ సమీపంలో పెద్ద శబ్దంతో పేలుడు సంభవించింది. పవిత్ర రంజాన్ మాసం చివరి శుక్రవారం సందర్భంగా పాలస్తీనాతో సంఘీభావం తెలుపుతూ ఇరాన్ ప్రజలు ఈ నిరసనలు చేపడుతుంటారు. పేలుడు దెబ్బకు ఆకాశంలోకి దట్టమైన పొగలు ఎగిసిపడటంతో జనం ప్రాణభయంతో పరుగులు తీశారు.ప్రస్తుతం ఈ ఘటనలో - మిగతా 2 లో




## హిడ్మాను చిత్రహింసలకు
# గురి చేసి చంపేశారు

- మాజీ మావోయిస్టు అగ్రనేత దేవ్‌జీ
- హిడ్మా లొంగిపోతానని చెప్పినప్పుడు తాము వారించాం
- పోలీసుల ట్రాప్‌లో పడి ఆయన ప్రాణాలు కోల్పోయారని దేవ్‌జీ అన్నారు
- 'ఆపరేషన్ కగార్' సమయంలో బస్వరాజు చేసిన విజ్ఞప్తిని కేంద్రం పట్టించుకోకపోవడం వల్లే ప్రతిఘటన

## అమిత్ షాకు
# కేటీఆర్ లేఖ




- రేవంత్ రెడ్డి బినామీ కంపెనీపై కేసులను ప్రభుత్వం తారుమారు చేసింది
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు
- అధికారులపై ముఖ్యమంత్రి ఒత్తిడి తెచ్చి సాక్ష్యాలను మాయం చేయించారని మండిపడ్డారు
- రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, పోలీసు వ్యవస్థపై ప్రజలకు నమ్మకం పోయే పరిస్థితి వచ్చిందని కేటీఆర్ అన్నారు

## గ్యాస్ కొరత లేదు..
# వదంతులు నమ్మొద్దు

- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- గ్యాస్ కొరతపై నెలకొన్న అపోహల నేపథ్యంలో మంత్రి సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం
- ప్రజల్లో నెలకొన్న గందరగోళాన్ని తొలగించేందుకు తక్షణ చర్యలు
- గ్యాస్ సిలిండర్లను బ్లాక్ మార్కెట్‌కు తరలించినా, కృత్రిమ కొరత సృష్టించినా కఠిన చర్యలు
- నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠినంగా వ్యవహరించాలని కలెక్టర్లు, ఎస్పీలు, పోలీసు కమిషనర్లకు ఆదేశాలు జారీ
- ఎక్కడా ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్పష్టం




**హైదరాబాద్ :** తెలంగాణలో గ్యాస్ సిలిండర్ల కొరత ఉందంటూ వస్తున్న వదంతులపై రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టత ఇచ్చారు. రాష్ట్రంలో గ్యాస్‌కు ఎలాంటి కొరత లేదని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన భరోసా ఇచ్చారు. గ్యాస్ కొరతపై నెలకొన్న అపోహల నేపథ్యంలో మంత్రి ఇవాళ సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, కలెక్టర్లు, పౌరసరఫరాల శాఖ అధికారులు, ఆయిల్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. రాష్ట్రంలో గ్యాస్ నిల్వలు, సరఫరా పరిస్థితిపై మంత్రి కూలంకషంగా - మిగతా 2 లో

RNI : APTEL/25/A0108 www.mahinewsindia.com epaper: https://epaper.mahinewsindia.com

# సంపాదకీయం

## నవ నేపాల్

ఇది జెన్‌జీ విజయం అంటున్నారంతా. నేపాలీలు గత పాలకులపట్ల ఎంత ఆగ్రహంగా ఉన్నారో బాలెన్‌షా ఘనవిజయం స్పష్టంగా తెలియచెబుతోంది. ఒక పార్టీ మూడింట రెండువంతుల మెజారిటీతో అధికారంలోకి రావడమన్నది ఆ దేశం ఎన్నడూ చూడనిది. పదిహేడేళ్ళ ప్రజాస్వామ్య చరిత్రలో , చివరకు 2008లో ప్రజాస్వామ్యానికి పునాదులు వేసిన మావోయిస్టులకు కూడా దక్కనంత అపూర్వమైన ప్రజాదరణ రాష్ట్రీయ స్వతంత్రపార్టీకి లభించింది. ఆ పార్టీ అధ్యక్షుడు రబీ లామిచేని, కాబోయే ప్రధాని బాలెన్‌షాలను భారతప్రధాని నరేంద్రమోదీ అభినందించి, పరస్పర సహకారంతో కలసి సాగుదామనడం, వారిద్దరూ చక్కగా, సానుకూలంగా ప్రతిస్పందించడం బాగుంది.సినిమా ఆఖరుఘట్టంలో దుష్టనాయకులను జనం తరిమితరిమికొట్టినట్లుగా నేపాల్ ప్రజలు తమకు నచ్చనివారిని అవమానకరమైన రీతిలో దింపేశారు. ఇది క్షణికావేశమనీ, సోషల్‌మీడియా నిషేధం ద్వారా ఖడ్గప్రసాద్ శర్మ ప్రభుత్వం కొరివితో తలగోక్కుందని అంతా అనుకున్నారు. ప్రభుత్వ ఆదేశాలు బేఖాతరు చేసిన సోషల్ మీడియా సంస్థలను చూసీచూడనట్టుగా వదిలివేసి ఉంటే నేపాల్‌లో ఏ మార్పూ ఉండేది కాదా? అన్నది అటుంచితే, ప్రజల్లో ఏళ్ళతరబడి గూడుకట్టుకొని ఉన్న నిరాశానిస్పృహలు ఒక్కసారిగా పెల్లుబుకడానికి ఆ నిషేధం దోహదం చేసింది. పాలకులు తక్షణమే ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నా, వీధుల్లోకి వచ్చిన జనం నాయకులను దించేసేవరకూ వెనక్కుపోలేదు. దశాబ్దాలుగా అధికారంలో ఉన్నవారిని ఒక మహోద్యమంతో స్వల్పకాలంలోనే గద్దెదించేసిన ప్రజలు తగిన విచక్షణతో సరైనవారిని ఎన్నుకోగలరా? అన్న ప్రశ్నకు సమాధానంగా నేపాలీలు ఇప్పుడు బాలెన్‌షాను ముందుకు తెచ్చారు. పాతతరాన్ని వెనక్కునెట్టి, నవనాయకత్వాన్ని అధికారంలో కూచోబెట్టుకున్నారు.బాలెన్ సారథ్యంలో నేపాల్ ఒక కొత్త ప్రయాణం ఆరంభించింది. గతంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా, పహాడీలు, మధేశీలు అంటూ ఒక విభజన ఉండేది. ఇప్పుడు కొండ, లోయ ప్రాంతాలవారిద్దరూ ఒక్కటిగా బాలెన్‌కు పట్టం కట్టారు. మధేశీ, మైథిలీ మూలాలున్న వ్యక్తి ప్రధాని కావడం కూడా ఇదే మొదటిసారి. జెన్‌జీ ఉద్యమానికి నాయకత్వం వహించి నేపాలీలందరినీ ఏకతాటిపై నిలబెట్టడమేకాక, ఎన్నికలకు రెండునెలల ముందే ఆర్ఎస్‌పితో చేయి కలిపి దానికి ఘనవిజయాన్ని చేకూర్చడం విశేషం. కాంగ్రెస్, కమ్యూనిస్టులు, ఇతరత్రా చిన్నా చితకా పార్టీలన్నీ ఒక్కటై బాలెన్‌ను అధికారంలోకి రాకుండా అడ్డుకుంటాయన్న భయం కూడా ప్రజల్లో ఉన్నందునే ఆయనకు ఇంతటి ఘన విజయం చేకూరి ఉంటుంది. జెన్‌జీ ఉద్యమం దెబ్బకు కకావికలైన నాయకులంతా తిరిగి ఎన్నికల బరిలో నిలవడం, పార్టీ అంతర్గత సంస్కరణల పేరిటా, హామీల పేరిటా మళ్ళీ మభ్యపెట్టే ప్రయత్నం చేయడంతో, ఎన్నికల అనంతరం వీరంతా ఒక్కటై తమ నెత్తిన కూచోకుండా ప్రజలు ముందుగానే జాగ్రత్తపడ్డారని అర్థం.అనాదిగా సంకీర్ణ ప్రభుత్వాలనే అనుభవిస్తూ వచ్చిన నేపాలీలు ఇకపై ఆ అవసరమే లేని ప్రభుత్వాన్ని ప్రతిష్ఠించుకున్నారు. ఆయా రాజకీయపార్టీల మధ్య కుట్రలకు, వాటి నాయకుల మధ్య వెన్నుపోట్లకు తావులేకుండా చేశారు. అత్యంత కీలకమైన, విధానపరమైన నిర్ణయాలకు మోకాలడ్డుతూ తమదే పై చేయి కావడంకోసం ప్రజావ్యతిరేకంగా వ్యవహరించే పార్టీలకు స్వస్తిపలికారు. దశాబ్దంన్నరకు పైగా ఏ ఒక్క ప్రభుత్వమూ ఐదేళ్ళకు మించి నిలవని దేశంలో ఒక పార్టీకి కనీవినీ ఎరుగనంత మెజారిటీ కట్టబెట్టి సుస్థిరత సాధించుకున్నారు.ఒక గాయకుడు, ఒక టీవీస్టార్ చేయిచేయీ కలిపి అధికారంలోకి రావడం



బాగున్నది కానీ, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పరిపాలించడమే పెద్ద సవాల్. పాలనానుభవం లేని ఈ యువనాయకుల మీద ప్రజలు నమ్మకం పెట్టుకున్నారు. పదిహేడేళ్ళుగా తమను మోసం చేస్తున్న నాయకుల మాదిరిగా వీరు వ్యవహరించబోరని, తమను అష్టదరిద్రాలనుంచి బయటపడవేస్తారని జనం ఆశిస్తున్నారు. ప్రజలు ఎక్కువ కాలం ఓపికగా నిరీక్షించలేరన్న మాట నిజమే కానీ, వారి ఆశలన్నీ నెరవేర్చలేకపోయినా, అవినీతి, ఆశ్రితపక్షపాతాలకూ ఖర్చుదారీ విధానాలకూ దూరంగా ఉంటూ దేశాన్ని క్రమంగా గాడినపెట్టడానికి వీరిద్దరూ ప్రయత్నిస్తే అంతే చాలు. అధికారంలోకి రావడంకోసం అతివేగంగా ఒక్కటైన ఈ నాయకులు ఇద్దరూ రేపటిరోజుల్లో తమ మధ్య తలెత్తే విభేదాలను త్వరితంగా పరిష్కరించుకుంటూ ఐదేళ్ళూ కొనసాగడం మరింత ముఖ్యం.

# రాష్ట్రంలో భారీగా భూ కేటాయింపులు

**మొదటిపేజీ తరువాయి –**
నిర్ణయాలను వెల్లడించారు.

**భూ కేటాయింపులపై కీలక నిర్ణయాలు**

రాయలసీమ ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన కడప స్టీల్ ప్లాంట్ ఏర్పాటు దిశగా ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగు పరిధిలోని పలు గ్రామాల్లో 424.45 ఎకరాల ప్రభుత్వ భూమిని జేఎస్‌డబ్ల్యూ స్టీల్ సంస్థకు కేటాయించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. రూ.21.30 కోట్ల చెల్లింపుపై ఈ భూమిని ఏపీఐఐసీకి బదలాయించనున్నారు. రెండేళ్లలో ప్లాంట్ ఉత్పత్తి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. వీటితో పాటు కిమ్స్ ఆసుపత్రికి 2 ఎకరాలు, సంబంధిత ట్రస్టుకు 23 ఎకరాలు, తుళ్లూరు ఎడ్యుకేషన్ సొసైటీకి 3 ఎకరాలు పరిహారంగా కేటాయించారు. బాపట్ల జిల్లాలో లగ్జరీ రిసార్టుల కోసం ఏపీ టూరిజం అథారిటీకి 17 ఎకరాలు, చిత్తూరు జిల్లాలో పర్యాటక అభివృద్ధికి 20 ఎకరాలు, నెల్లూరులో ఈఎస్ఐసీ ఆసుపత్రి నిర్మాణానికి ఎకరం భూమిని కేటాయించారు. ముత్తుకూరులో సింగపూర్ కంపెనీ సీఎస్ఆర్ నిధులు రూ.20 కోట్లతో నిర్మించనున్న ఆసుపత్రి కోసం 86 సెంట్ల భూమిని నామమాత్రపు ధరకు ఇచ్చేందుకు నిర్ణయించారు.

**గిరిజన రైతులకు 100 శాతం సబ్సిడీ**

దాత్రి ఆభా జనజాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్‌లో భాగంగా 8 గిరిజన జిల్లాల్లోని అటవీ హక్కు పత్రాలు (ఎఫ్ఆర్ఏ) ఉన్న రైతులకు ప్రభుత్వం భారీ ఊరట కల్పించింది. 'పర్ డ్రాప్ మోర్ క్రాప్' పథకం కింద డ్రిప్ ఇరిగేషన్‌పై 100 శాతం, స్ప్రింక్లర్లపై 90 శాతం సబ్సిడీని శాచురేషన్ పద్ధతిలో అందించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. కొండ ప్రాంతాల్లో సాగు చేసే గిరిజనులకు నీటి వనరుల సమస్యను అధిగమించి, అధిక దిగుబడులు సాధించేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుంది. రాష్ట్ర ప్రభుత్వం తన వాటాను 54 శాతానికి పెంచుకోవడం వల్లే ఇది సాధ్యమైందని మంత్రి వివరించారు.

**నీటి కాలుష్య నివారణ చట్టానికి ఆమోదం**

కేంద్ర ప్రభుత్వం రూపొందించిన 'నీటి కాలుష్య నివారణ, నియంత్రణ సవరణ చట్టం-2024'ను రాష్ట్రంలోనూ అమలు



చేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ కొత్త చట్టం ప్రకారం, చిన్న చిన్న ఉల్లంఘనలకు విధించే జైలు శిక్షలను తొలగించి, వాటి స్థానంలో జరిమానాలు మాత్రమే విధిస్తారు. ఈ చట్టాన్ని ఆమోదించడం ద్వారా రాష్ట్రంలోని కాలుష్య నగరాలకు 'నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం' కింద కేంద్రం నుంచి నిధులు పొందేందుకు, పరిశ్రమలపై ఫీజుల భారం తగ్గించుకునేందుకు వీలు కలుగుతుంది.

**ఉద్యోగినుల కోసం 'సఖీ నివాస్' హాస్టళ్లు**

మిషన్ శక్తి పథకం కింద రాష్ట్రంలో ఉద్యోగాలు చేసే మహిళల కోసం 'సఖీ నివాస్' పేరుతో 30 వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్లను ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. సురక్షితమైన వసతితో పాటు, చిన్న పిల్లలున్న తల్లుల సౌకర్యార్థం ఈ హాస్టళ్లలో క్రెష్ (శిశు సంరక్షణ కేంద్రం) సదుపాయాన్ని కూడా కల్పిస్తారు. ఉద్యోగినులు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో హాస్టల్ నిర్వహణకు 8 మంది సిబ్బందిని అవుట్ సోర్సింగ్ పద్ధతిలో నియమిస్తారు.

**వ్యాపారులకు జీఎస్టీ ట్రిబ్యునల్స్**

జీఎస్టీ సంబంధిత వివాదాల పరిష్కారాన్ని సులభతరం చేసేందుకు, వ్యాపారులకు సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం అన్ని అప్పీళ్లను విజయవాడలోనే విచారిస్తుండటంతో తీవ్ర జాప్యం జరుగుతోంది. దీన్ని నివారించేందుకు విశాఖపట్నం, తిరుపతి, విజయవాడలలో మూడు అప్పిలేట్ ట్రిబ్యునల్ కార్యాలయాలను నోటిఫై చేసేందుకు కేబినెట్ ఆమోదించింది. దీనివల్ల కేసులు త్వరగా పరిష్కారమై రాష్ట్రానికి రావాల్సిన ఆదాయం కూడా సకాలంలో అందుతుంది.

**జల జీవన్ మిషన్‌కు భారీగా నిధులు**

ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో చేపట్టిన జల జీవన్ మిషన్ (జేజేఎమ్) పథకం గడువు ముగిసినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వ చొరవతో కేంద్రం దానిని 2028 వరకు పొడిగించింది. ఈ నేపథ్యంలో, వివిధ పథకాల కింద నిధులు సమకూర్చుకుని రూ.9,355 కోట్ల విలువైన ఏడు భారీ ప్రాజెక్టులకు మంత్రివర్గం పరిపాలన ఆమోదం తెలిపింది. అలాగే, తీవ్ర నీటి ఎద్దడి ఎదుర్కొంటున్న 3000 నివాస ప్రాంతాలకు రూ.1,814.71 కోట్లతో తాగునీటి పనులు చేపట్టేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ ప్రాజెక్టుల ద్వారా 76 మండలాల్లోని 65 లక్షల మందికి లబ్ధి చేకూరనుంది.

**కొత్తగా కేంద్రీయ విద్యాలయాలు**

రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ఊతమిస్తూ మూడు కొత్త కేంద్రీయ విద్యాలయాల (కేవీ) ఏర్పాటుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం రాఘవాపురంలో 5 ఎకరాలు, ఏలూరు జిల్లా నూజివీడులో 7 ఎకరాలు, శ్రీకాకుళం జిల్లా పలాస మండలం పురుషోత్తపురంలో 5 ఎకరాల చొప్పున భూమిని కేంద్రీయ విద్యాలయ సంఘటన్‌కు కేటాయించారు. బదిలీలపై వచ్చే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలతో పాటు స్థానిక విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం దీని ముఖ్య ఉద్దేశం.

**పోలవరం పనుల వేగవంతానికి ఆమోదం**

రాష్ట్ర జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు పనులను మరింత వేగవంతం చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. కాంట్రాక్ట్ గడువు జూన్ 2027 వరకు ఉన్నప్పటికీ, పనులను త్వరగా పూర్తి చేసే లక్ష్యంతో మూడో గ్యాంట్రీ క్రేన్‌ను ఏర్పాటు చేసేందుకు అంగీకరించింది. ప్రాజెక్టులో లైనింగ్ పనులతో పాటు, సుదీర్ఘకాలం పనులు నిలిచిపోవడం వల్ల దెబ్బతిన్న రాతి పొరల వద్ద భద్రతా చర్యలు చేపట్టనున్నారు. ఈ అదనపు పనుల కోసం ప్యాకేజీ-63ఏ కు రూ.23.47 కోట్లు, ప్యాకేజీ-64ఏ కు రూ.24.51 కోట్ల అదనపు వ్యయానికి కేబినెట్ ఆమోదం తెలిపిందని మంత్రి పార్థసారథి వివరించారు.

# ఏపీ హైకోర్టు జడ్జిగా జస్టిస్ లిసా గిల్

**మొదటిపేజీ తరువాయి -**

ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ లిసా గిల్ బాధ్యతలు స్వీకరించారు. హైకోర్టులోని మొదటి కోర్టు హాలులో జరిగిన కార్యక్రమంలో ప్రధాన న్యాయమూర్తి (జజీ) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ఆమెతో ప్రమాణం చేయించారు. పంజాబ్-హరియాణా హైకోర్టులో జస్టిస్ లిసా గిల్ సీనియారిటీలో 3వ స్థానంలో కొనసాగుతుండగా, ఆమెను ఏపీ హైకోర్టుకు బదిలీ చేస్తూ రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము ఇటీవల ఆమోదం ముద్ర వేశారు. హైకోర్టులో జస్టిస్ లిసా గిల్ సీనియారిటీలో 2వ స్థానంలో కొనసాగుతారు. హైకోర్టు ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి (జజీ) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ఏప్రిల్ 24న పదవీ విరమణ చేయనున్నారు. ఆ వెంటనే జస్టిస్ లిసా గిల్ హైకోర్టు సీజేగా ఆ స్థానంలో కొనసాగుతారు. ఏపీ హైకోర్టు తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా ఆమె రికార్డు సృష్టించనున్నారు. హైకోర్టులో మొత్తం 37 మంది న్యాయమూర్తుల నియామకానికి ఆమోదం ఉండగా, ప్రస్తుతం ఆ సంఖ్య 33 ఉంది. తాజాగా జస్టిస్ లిసా గిల్ రాకతో ఆ సంఖ్య 34కు చేరింది. హైకోర్టు న్యాయమూర్తి విశేషాలు ఇవే: హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్ స్వస్థలం చండీగఢ్. అక్కడి కార్మెల్ కాన్వెంట్ స్కూల్‌లో పాఠశాల విద్య అభ్యసించారు. ప్రభుత్వ మహిళా కాలేజీలో హ్యూమానిటీస్‌లో డిగ్రీ చదివారు. పంజాబ్ యూనివర్సిటీలో ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం పూర్తి చేశారు. జస్టిస్ లిసా గిల్ 1990లో న్యాయవాదిగా పేరు నమోదు చేసుకుని, పంజాబ్-హరియాణా హైకోర్టులో ప్రాక్టీస్ ప్రారంభించారు. సివిల్, క్రిమినల్, రెవిన్యూ, రాజ్యాంగ పరమైన కేసుల ద్వారా అన్ని రంగాల్లో అనుభవం గడించారు. ఆమె సుదీర్ఘ కాలం పాటు చండీగఢ్‌కు పలు కార్పొరేషన్లు, ప్రభుత్వ రంగ బోర్డులకు ప్రాతినిధ్యం వహించారు. అనంతరం 2014 మార్చి 31న పంజాబ్-హరియాణా హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. పంజాబ్-హరియాణా హైకోర్టులో జస్టిస్ లిసా గిల్ సేవలు అందించారు. నియామకం 2 నెలలు ముందుగానే: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి (జజీ×) జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలో ఇటీవల కొలీజియం సమావేశమైన విషయం తెలిసిందే. ప్రస్తుత హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (జజీ) సీజే పదవీకాలం ఏప్రిల్ 24తో ముగుస్తుంది. ఈ నేపథ్యంలో జస్టిస్ లిసా గిల్‌ను ఏపీ హైకోర్టుకు న్యాయమూర్తిగా 2 నెలల ముందుగానే బదిలీ చేయాలని నిర్ణయించింది. ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి (జజీ)గా ఉన్న జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ బాధ్యతల నుంచి వైదొగిలిన వెంటనే జస్టిస్ లిసా గిల్‌ను ఏపీ సీజేగా ప్రతిపాదిస్తూ కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. నూతన సంప్రదాయానికి శ్రీకారం: రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తుల నియామకానికి సంబంధించి సుప్రీంకోర్టు కొలీజియం నూతన సంప్రదాయానికి శ్రీకారం చుట్టింది. ప్రస్తుత సీజేల పదవీ విరమణ కాలం ముగియడానికి 2 నెలల ముందే, ఆ స్థానంలోకి కొత్త న్యాయమూర్తి పేరును ప్రతిపాదించాలని నిర్ణయించింది. న్యాయ పరిపాలన వ్యవస్థను బలోపేతం చేసి దాని సామర్థ్యం, నాణ్యతను పెంచేందుకు ఈ విధానం ఉపయోగపడుతుందని కొలీజియం పేర్కొంది. ఈ విధానం వల్ల హైకోర్టు సీజేగా బాధ్యతలు చేపట్టే లోపు ఆ హైకోర్టు వాతావరణానికి అలవాటు పడటానికి వీలవుతుందని పేర్కొంది. దీనిలో భాగంగా జస్టిస్ లిసా గిల్‌ను ఏపీ హైకోర్టుకు న్యాయమూర్తిగా తొలుత బదిలీ చేశారు. ప్రస్తుత సీజేగా ధీరజ్ సింగ్ ఠాకూర్ పదవీ విరమణ చేసిన వెంటనే ఆమె ఆ స్థానంలో నియమితులుకానున్నారు.

# ఈశాన్యంలో బీజేపీతోనే శాంతి

**మొదటిపేజీ తరువాయి –**

కోక్రఝర్ జిల్లాలో బీజేపీ ఏర్పాటు చేసిన బహిరంగ సభను ఉద్దేశించి గువహటి నుంచి ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రసంగించారు. కోక్రఝర్‌లో జరిగే సభకు మోదీ వెళ్లాల్సి ఉండగా, అకస్మాత్తుగా వర్షం కురవడంతో ఆయన ప్రయాణానికి ఆటంకం కలిగింది. స్థానికుల భూములను చొరబాటుదారులకు కట్టబెట్టడం ద్వారా భారత జాతీయ భద్రతను కాంగ్రెస్ పార్టీ ప్రమాదంలోకి నెడుతోందని మోదీ విమర్శించారు. అందుకే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని శిక్షించి, ఈ దేశంలో చొరబాటుదారులకు చోటు లేదనే స్పష్టమైన సందేశాన్ని ఇవ్వాలని అసోం ప్రజలకు పిలుపునిచ్చారు.కాంగ్రెస్ పార్టీ అనేది అబద్ధపు హామీల దుకాణమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ విమర్శించారు. రాజకీయ ప్రయోజనాల కోసం సమాజంలోని వివిధ వర్గాల ప్రజల మధ్య హస్తం పార్టీ చీలికలను సృష్టిస్తోందని ఆయన మండిపడ్డారు. బోడోల్యాండ్‌కు చెందిన చాలా తరాల ప్రజలను కాంగ్రెస్ పార్టీ తప్పుడు కలల ప్రపంచంలో ఉంచి కాలయాపన చేసిందన్నారు. కేంద్రంలో, అసోంలో బీజేపీ అధికారంలోకి వచ్చాకే బోడో శాంతి ఒప్పందంపై సంతకాలు జరిగాయని ప్రధాని మోదీ గుర్తుచేశారు. దీని ద్వారా అన్ని ప్రధాన సంస్థలు, గ్రూపులను ఏకతాటిపైకి తెచ్చామన్నారు. "కాంగ్రెస్‌కు చెందిన అబద్ధపు హామీల దుకాణంలో ప్రతీ అబద్ధపు హామీతో పాటు నాలుగు సూపర్ అబద్ధాలను బోనస్ గిఫ్టుగా ఇస్తుంటారు. ఎందుకంటే ఆ హామీలను నెరవేర్చాలనే ఉద్దేశమే కాంగ్రెస్ పార్టీకి ఉండదు. బీజేపీ అసోంలో గెలిచాకే, బోడోల్యాండ్‌లో శాంతి, వికాసం మొదలయ్యాయి. బోడో వర్గం ప్రజలు భాషను, సంస్కృతిని కాపాడుకుంటున్న తీరును తలుచుకుంటే నాకు గర్వంగా అనిపిస్తుంది. మీ ప్రేమకు నేను రుణపడిపోయాను. ఇక్కడ అభివృద్ధి పనులు చేసి ఆ రుణాన్ని తీర్చుకుంటాను. కొన్నివారాల క్రితం, బోడో సంస్కృతితో ముడిపడిన కార్యక్రమాలను చూసే అవకాశం నాకు గువాహటిలో లభించింది. 2020 అగ్రిమెంట్‌లో భాగంగా మేం ఇచ్చిన హామీలన్నీ ఒకదాని తర్వాత ఒకటిగా అమలుచేసి తీరుతాం. బోడో భాషకు ఇప్పటికే సహ అధికార భాష హోదాను ఇచ్చాం. బోడోల్యాండ్ వికాసానికి రూ.1,500 కోట్ల ప్రత్యేక ప్యాకేజీని ఇచ్చాం. ప్రస్తుతం కోక్రఝర్‌లో ఒక మెడికల్ కాలేజీ కూడా ఉంది. ఇళ్లకు తిరిగొచ్చిన కుమారుల తల్లులు అందరూ నాకు దీవెనలు ఇస్తున్నారు. ఆ యువకులంతా ఇప్పుడు కుటుంబాలతో సంతోషంగా, శాంతితో జీవిస్తున్నారు" అని ప్రధాని మోదీ తెలిపారు. అసోంలోని కోక్రఝర్ జిల్లాకు సంబంధించిన రూ.4,570 కోట్లు విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రధాని మోదీ ప్రారంభించారు. కోక్రఝర్ జిల్లా బాష్‌బరీలో రైల్వేశాఖకు చెందిన పీరియాడిక్ ఓవర్ హాలింగ్ (పీఓహెచ్) వర్క్‌షాప్ పనులకు ప్రధాని మోదీ శుక్రవారం పునాది రాయి వేశారు. ఈ ప్రాజెక్టు వల్ల స్థానికంగా రైళ్ల నిర్వహణ సదుపాయాలు అందుబాటులోకి వస్తాయి. ఉద్యోగ అవకాశాలు ఏర్పడతాయి. ప్రధాని పచ్చజెండా ఊపి కోక్రఝర్ జిల్లాతో పాటు ఈశాన్య రాష్ట్రాల మధ్య కనెక్టివిటీని పెంచే మూడు కొత్త రైలు సేవలకు శ్రీకారం చుట్టారు. ఈ మూడు రైలు సర్వీసుల్లో కామాఖ్య - చర్లపల్లి అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్, గువహటి - న్యూ జల్‌పాయ్‌గురి ఎక్స్‌ప్రెస్, నారంగి - అగర్తలా ఎక్స్‌ప్రెస్ ఉన్నాయి. కామాఖ్య - చర్లపల్లి అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ అనేది ఈశాన్య రాష్ట్రాలతో దక్షిణ భారతదేశాన్ని లింక్ చేస్తుంది. ఈ కొత్త రైలు సర్వీసులు అసోంలో టూరిజం, రవాణా, వ్యవసాయం, గ్రామీణ వికాసాలకు ఊతం ఇస్తాయి. అసోం మాలా 3.0 అనే ప్రధానమైన రోడ్డు మౌలిక సదుపాయాల ప్రాజెక్టు పనులకు ప్రధాని మోదీ శుక్రవారం భూమిపూజను నిర్వహించారు. రూ.3,200 కోట్లు విలువైన ఈ ప్రాజెక్టు ద్వారా అసోంవ్యాప్తంగా 900కుపైగా కి.మీ రోడ్లను నిర్మించనున్నారు. నేషనల్ హైవేలను, గ్రామీణ రోడ్లతో అనుసంధానించనున్నారు. బోడోలాండ్ టెర్రిటోరియల్ కౌన్సిల్ ఏరియాలో 6 రోడ్డు మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు ప్రధాని మోదీ భూమి పూజను నిర్వహించారు. ఇందులో భాగంగా రూ.1,100 కోట్లతో నాలుగు ఫ్లై ఓవర్లు, రెండు బ్రిడ్జీలను నిర్మించనున్నారు. అసోంలోని సిల్చార్‌లో వివిధ ప్రాజెక్టులకు ప్రధాని మోదీ భూమి పూజ నిర్వహించనున్నారు. పనులు పూర్తయిన పలు ప్రాజెక్టులను దేశానికి అంకితం ఇవ్వనున్నారు. ఈ ప్రాజెక్టుల మొత్తం విలువ దాదాపు రూ.23,550 కోట్లు. వచ్చే (ఏప్రిల్) నెలలోనే అసోంలో అసెంబ్లీ ఎన్నికలు జరిగే అవకాశాలు ఉన్నాయి. ఈనేపథ్యంలో రెండు రోజుల పర్యటన కోసం శుక్రవారం రోజే అసోంకు ప్రధాని మోదీ చేరుకున్నారు. ఇప్పటికే వరుసగా రెండు అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయ దుందుభి మోగించింది. ఈసారి ఎన్నికల్లోనూ గెలిచి, వరుసగా మూడోసారీ అసోం అధికార పీఠాన్ని కైవసం చేసుకోవాలనే సంకల్పంతో మోదీసేన ఉంది.

## ఇక 24 గంటలూ షాపులు ఓపెన్..!

**మొదటిపేజీ తరువాయి –** ఏపీలోని వ్యాపారులకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. సులభతర వాణిజ్యంలో భాగంగా రాష్ట్రంలోని ప్రధాన నగరాలు, పట్టణాల్లో దుకాణాలు, వాణిజ్య సంస్థలను 24 గంటలూ నిర్వహించుకునేందుకు అనుమతిస్తూ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. 4 లక్షలు అంతకంటే ఎక్కువ జనాభా ఉన్న ప్రాంతాల్లో ఈ నిబంధన వర్తిస్తుందని స్పష్టం చేసింది.రాష్ట్ర కార్మిక శాఖ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. షాపులు, వాణిజ్య సంస్థల చట్టం-1988లోని కొన్ని నిబంధనల నుంచి మినహాయింపు ఇస్తూ ఈ నిర్ణయం తీసుకుంది. అయితే, ఈ వెసులుబాటు కల్పిస్తూనే ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించి ప్రభుత్వం కొన్ని స్పష్టమైన నిబంధనలను విధించింది. ప్రతి ఉద్యోగితో వారానికి గరిష్ఠంగా 48 గంటలు మాత్రమే పని చేయించాలని, ఆ సమయం మించితే తప్పనిసరిగా ఓవర్ టైం జీతం చెల్లించాలని ఆదేశించింది.అలాగే, ఉద్యోగులందరికీ వారానికి ఒక రోజు సెలవు ఇవ్వాలని స్పష్టం చేసింది. ప్రభుత్వ సెలవు దినాల్లో పని చేయించాల్సి వస్తే, అందుకు బదులుగా మరో రోజు ప్రత్యామ్నాయ సెలవు మంజూరు చేయాలని పేర్కొంది. దీంతో పాటు 20 మంది లేదా అంతకంటే ఎక్కువ సిబ్బంది ఉన్న సంస్థలు లైఫ్‌టైమ్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ పొందేందుకు కూడా కార్మిక శాఖ అనుమతించింది. ఈ నిర్ణయంతో రాష్ట్రంలో వాణిజ్య కార్యకలాపాలు మరింత పెరిగే అవకాశం ఉండగా, అదే సమయంలో ఉద్యోగుల హక్కులకు భద్రత కల్పించడం గమనార్హం.

## వారిని అంతం చేస్తున్నా

**మొదటిపేజీ తరువాయి –** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ఇరాన్‌కు హెచ్చరికలు జారీ చేశారు. అమెరికా అధ్యక్షుడిగా వారిని అంతం చేస్తున్నానని ట్రంప్ వ్యాఖ్యానించారు. మతిచెడిన నేతలకు ఈరోజు ఏం జరుగుతుందో మీరే చూస్తారని అన్నారు. ఇరాన్ నౌకాదళం ఇప్పటికే కనుమరుగయ్యిందని, ఇక వైమానిక దళం కూడా ఉండదని హెచ్చరించారు. క్షిపణులు, డ్రోన్లు పూర్తిగా ధ్వంసం అవుతున్నాయని ఆయన అన్నారు. ఇప్పటికే వారి నాయకులు తుడిచిపెట్టుకుపోయారని అన్నారు. అక్కడి పాలకులు 47 ఏళ్ళుగా అమాయకులను పొట్టన పెట్టుకున్నారని ఆరోపించారు. అందుకే అగ్రరాజ్యం అధ్యక్షుడిగా వారి అంతు చూస్తున్నానని ట్రంప్ అన్నారు. ఇదిలా ఉండగా, అమెరికాకు చెందిన రీఫ్యూయలింగ్ విమానం కేసీ-135 ట్యాంకర్ ఉత్తర ఇరాక్‌లో కుప్పకూలింది. ఈ ఘటనలో నలుగురు సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదం సమయంలో విమానంలో ఆరుగురు ఉన్నారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని, ఘటనకు దారి తీసిన చర్యలపై దర్యాప్తు చేస్తున్నామని అమెరికా మిలిటరీ సెంట్రల్ కమాండ్ తెలిపింది.


## ఇజ్రాయెల్ వార్నింగ్ ఇచ్చిన కాసేపటికే

**మొదటిపేజీ తరువాయి –** ఎంతమంది ప్రాణాలు కోల్పోయారు, ఎంతమంది గాయపడ్డారు అనే దానిపై ఇరాన్ ప్రభుత్వం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. సంఘటనా స్థలంలో సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఇప్పటికే ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న తరుణంలో.. ఇజ్రాయెల్ ముందస్తు హెచ్చరికలు చేసిన వెంటనే ఈ పేలుడు జరగడం పశ్చిమాసియాలో మరింత ఆందోళనను రేకెత్తిస్తోంది.

## గ్యాస్ కొరత లేదు.. వదంతులు నమ్మొద్దు

**మొదటిపేజీ తరువాయి –** సమీక్షించారు. ప్రజల్లో నెలకొన్న గందరగోళాన్ని తొలగించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు.గ్యాస్ సిలిండర్లను బ్లాక్ మార్కెట్‌కు తరలించినా, కృత్రిమ కొరత సృష్టించినా కఠిన చర్యలు తప్పవని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠినంగా వ్యవహరించాలని కలెక్టర్లు, ఎస్పీలు, పోలీసు కమిషనర్లకు ఆదేశాలు జారీ చేశారు. గృహ వినియోగదారులతో పాటు ఆసుపత్రులు, ప్రభుత్వ హాస్టళ్లకు సరిపడా గ్యాస్ సరఫరా అయ్యేలా చూడాలని అధికారులకు సూచించారు. ఎక్కడా ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్పష్టం చేశారు.

## హిడ్మాను చిత్రహింసలకు గురి చేసి చంపేశారు



**మొదటిపేజీ తరువాయి –** మాజీ మావోయిస్టు అగ్రనేత దేవ్‌జీ (తిప్పిరి తిరుపతి) లొంగిపోయిన సంగతి తెలిసిందే. ఆయుధాలను వదిలేసి ఆయన జన జీవన స్రవంతిలో కలిసిపోయారు. ఆయన మీడియా ప్రతినిధితో మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. హిడ్మా లొంగిపోతానని చెప్పినప్పుడు తాము వారించామని, అయితే పోలీసుల ట్రాప్‌లో పడి ఆయన ప్రాణాలు కోల్పోయారని దేవ్‌జీ అన్నారు. హిడ్మాది వంద శాతం బూటకపు ఎన్‌కౌంటర్ అని, ఆయనను చిత్రహింసలకు గురిచేసి చంపేశారని ఆయన ఆరోపించారు. 'ఆపరేషన్ కగార్' సమయంలో బస్వరాజు చేసిన విజ్ఞప్తిని కేంద్రం పట్టించుకోకపోవడం వల్లే ప్రతిఘటన అనివార్యమైందని, ఆ పోరాటంలోనే బస్వరాజును కోల్పోయామని వెల్లడించారు.మరోవైపు, అగ్రనేత గణపతి గురించి స్పందిస్తూ.. 2023లో జరిగిన కేంద్ర కమిటీ సమావేశంలో ఆయనను చివరిసారిగా చూశానని, ఆ తర్వాత ఆయనతో సంబంధాలు లేవని దేవ్‌జీ స్పష్టం చేశారు. సమాజంలో దోపిడీ రూపం మార్చుకుందే తప్ప తొలగిపోలేదని... దోపిడీ ఉన్నంత కాలం ఉద్యమం కొనసాగుతుందని ఆయన వ్యాఖ్యానించారు. మావోయిస్టు పార్టీపై నిషేధాన్ని ఎత్తివేసి, జైళ్లలో ఉన్న వారిని రాజకీయ ఖైదీలుగా గుర్తించాలని ప్రభుత్వాన్ని కోరారు. రాజకీయ పదవుల కోసం తాను ఎన్నికల్లో పోటీ చేయబోనని, చట్టం పరిధిలోనే ఉండి ప్రజా సమస్యలపై పోరాడతానని దేవ్‌జీ ప్రకటించారు.

## అమిత్ షాకు కేటీఆర్ లేఖ



**మొదటిపేజీ తరువాయి –** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బినామీ కంపెనీ కేఎల్ఎస్ఆర్ ఇన్‌ఫ్రాటెక్‌పై కేసులను ప్రభుత్వం తారుమారు చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. రేవంత్ రెడ్డి బినామీ వ్యాపారాలు చేస్తున్నారని విమర్శించారు. ఈ మేరకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాకు కేటీఆర్ లేఖ రాశారు. ఈ లేఖ ప్రతులను కేంద్రమంత్రులు నిర్మలా సీతారామన్, పీయూష్ గోయల్, అర్జున్ రామ్ మేఘవాల్‌లకు కూడా పంపించారు.తెలంగాణలో శాంతిభద్రతలు దిగజారాయని ఆ లేఖలో ఆందోళన వ్యక్తం చేశారు. కేఎల్ఎస్ఆర్ సంస్థపై కేసులు నమోదు కాగా, విచారణ వేళ ముఖ్యమంత్రి ఆదేశాలతో ప్రభుత్వం సాక్ష్యాధారాలను తారుమారు చేసిందని ఆరోపించారు. సాక్ష్యాలు పోయాయని చెప్పడం దారుణమని అన్నారు. అధికారులపై ముఖ్యమంత్రి ఒత్తిడి తెచ్చి సాక్ష్యాలను మాయం చేయించారని మండిపడ్డారు.రాష్ట్రంలో విచారణ సంస్థలు, పోలీసులను నమ్మే పరిస్థితి లేదని అన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, పోలీసు వ్యవస్థపై ప్రజలకు నమ్మకం పోయే పరిస్థితి వచ్చిందని అన్నారు. కేఎల్ఎస్ఆర్ కంపెనీ దివాలా తీసినా రేవంత్ రెడ్డి కాంట్రాక్టులు కేటాయించడం సరికాదని అన్నారు. ఈ సంస్థపై విచారణ జరగాలని, అది నిష్పక్షపాతంగా జరగాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. కేంద్ర ఏజెన్సీలు విచారణ చేయాలని సుప్రీంకోర్టు సూచించినా రాష్ట్రం పట్టించుకోలేదని అన్నారు.

# రైతులకు అండగా నిలిచిన కూటమి ప్రభుత్వం

## - శాసన సభ్యులు దేవ వరప్రసాద్



మార్చి 13, రాజోలు, మహి న్యూస్ : అన్నదాత సుఖీభవ కార్యక్రమంతో రైతులకు కూటమి ప్రభుత్వం అండగా నిలిచిందని రాజోలు నియోజకవర్గం శాసన సభ్యులు దేవ వరప్రసాద్ అన్నారు. కదలి గ్రామం లో డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ భవనంలో జరిగిన అన్నదాత సుఖీభవ మూడో విడత పంపిణీ కార్యక్రమంలో వరప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి రైతు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని, ఆర్థిక ఇబ్బందుల నుండి రైతులను కాపాడడానికి కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ప్రతి రైతుకి సంవత్సరానికి రూ.20,000 చొప్పున రైతులు ఖాతాలో జమ చేయడం జరుగుతుందని అన్నారు. మొదటి విడతగా 7000, రెండో విడతగా 7000, మూడో విడతగా 6000 రూపాయలు రైతుల ఖాతాలలో జమ చేయడం జరిగిందని, నియోజక వర్గంలో సుమారు 23 వేల మంది రైతులకు మూడు విడతలలో 46 కోట్ల రూపాయల నగదు రైతుల ఖాతా లలో జమ చేయడం జరిగిందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే ప్రతి సొసైటీ కి అధ్యక్షులను, నీటి సంఘం అధ్యక్షులను నియమించుకోవడం జరిగిందని తద్వారా రైతులకు కావలసిన ఆర్థిక సహకారాన్ని గాని నీటిపారుదలకు సంబంధించిన పనులు చేయటానికి ప్రభుత్వం అన్న ఇది రైతు ప్రభుత్వం రైతులకు పూర్తిగా అండగా నిలిచే ప్రభుత్వాన్ని అన్నారు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నరేంద్ర మోడీ సహకారంతో రైతులకు పూర్తిగా న్యాయం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమం లో మార్కెట్ కమిటీ చైర్మన్ కేతా వెంకటలక్ష్మి, రాజోలు మండల ప్రజాపరిషత్ అధ్యక్షురాలు కదలి శ్రీ దుర్గ, సఖినేటిపల్లి మండల ప్రజాపరిషత్ అధ్యక్షుడు వీర మల్లిబాబు, జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షులు ఆడబాల సత్యనారాయణ, మాజీ శాసనసభ్యులు మానేపల్లి అయ్యాజీ వేమ, రాష్ట్ర మార్కెఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్ద కాపు, రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ బందెల పద్మ, రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ ముదునూరి చినబాబు రాజు, స్పెషలాఫీసర్ ఆర్డీవో మమ్మీ, చాగంటి స్వామి, అడబాల విజయ్, గాలిదేవర ఎంకన్న బాబు, వులిశెట్టి లక్ష్మణరావు, మామిడిశెట్టి నాగరాజు, కదలి శ్రీనీతి కొండ, ఎలుమర్తి రాము, వడ్లమూడి చిన్ని, వడ్లమూడి ప్రకాష్, మేడిచర్ల బాబులు, ఆకన భాబ్జి నాయుడు, తిరుమల బాబి, జొన్నలగడ్డ గోపాలకృష్ణ, పిప్పల్ల మల్లిఖార్జున రావు, పిప్పల్ల వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.





# కాణిపాకంలో జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



చిత్తూరు జిల్లా/ కాణిపాకం మార్చి 12.మహి న్యూస్,: చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం కాణిపాకంలో జనసేన జెండా పార్టీ 13 వ దినోత్సవ వేడుకలు జయప్రదం చేయాలని జనసేన పార్టీ ఎం. మహేష్ స్వేరో పూతలపట్టు నియోజకవర్గ నాయకులు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. నియోజకవర్గస్థాయిలో అన్ని మండలాల్లో జనసేన మండల అధ్యక్షులు, జిల్లా,నియోజకవర్గ నాయకులు కార్యకర్తల ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మార్చి 14వ తేదీ ఉదయం ఐరాల మండలం అగరంపల్లి--కాణిపాకం కేంద్రం వద్ద జనసేన పార్టీ జెండా ఆవిష్కరణ ఘనంగా నిర్వహించడానికి, దాదాపు 1000 మందికి అన్నదాన కార్యక్రమం చేయడానికి జనసేన నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో పూతలపట్టు నియోజకవర్గంలోని అన్ని మండలాల జనసేన నాయకులు,కార్యకర్తలు, జనసైనికులు,జనసేన పార్టీ అభిమానులు, పవన్ కళ్యాణ్ అభిమానులు విరివిగా పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా చిత్తూరు జిల్లా జనసేన నాయకులు ఎం.మహేష్ స్వేరో పిలుపునిచ్చారు.జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి ప్రజా సమస్యల పట్ల,పేద,బడుగు,బలహీన వర్గాల అభివృద్ధి పట్ల,సమాజ కాంక్షకై నిరంతరం కృషి చేస్తున్న విషయం అందరికీ తెలిసిందే,అలాంటి జనసేన పార్టీ కార్యక్రమాల్లో,పార్టీ ఆశయ సాధనలో పాలుపంచుకోవడం జన సైనికుడిగా గర్వకారణమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్క జనసేన కార్యకర్త పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎం మహేశ్ స్వేరో కోరారు.

# ప్రజల నుండి వినతులను స్వీకరించి పరిష్కరించిన ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి



కర్నూలు ప్రతినిధి మహిన్యూస్ మార్చి 13: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడి ఆదేశాల మేరకు శుక్రవారం కోడుమూరు నియోజక వర్గం ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి తన నివాసం నందు నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో నియోజకవర్గం నలుమూలల నుంచి విచ్చేసిన వివిధ వర్గాల ప్రజల నుంచి వచ్చిన సమస్యలపై ఎమ్మెల్యే ప్రత్యక్షంగా అర్జీలు స్వీకరించారు.అర్జీలను పరిశీలించి సంబంధిత అధికారులతో ఫోన్‌లోనే మాట్లాడి కొన్ని సమస్యలకు తక్షణ పరిష్కారం అందించారు.మరికొన్ని సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేందుకు హామీ ఇచ్చారు.గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి పూర్తిగా కట్టుబడి ఉందని ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పేర్కొన్నారు.

# రైతుల సంక్షేమం కూటమి ప్రభుత్వ లక్ష్యం

## కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి



కర్నూలు ప్రతినిధి మహిన్యూస్ మార్చి 13: రైతుల సంక్షేమం కూటమి ప్రభుత్వ ప్రధాన లక్షమని కోడుపూరి ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు.శుక్రవారం పీఎం కిసాన్ – – అన్నదాత సుఖీభవ పథకం కింద మూడవ విడత నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసే కార్యక్రమంలో సి.బెళగల్ టౌన్ లో కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమం కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. రైతులకు ఆర్థికంగా అండగా నిలవడానికి కేంద్ర ప్రభుత్వం మరియు రాష్ట్ర ప్రభుత్వం కలిసి పీఎం కిసాన్ -- అన్నదాత సుఖీభవ పథకం ద్వారా నేరుగా రైతుల ఖాతాల్లో నిధులను జమ చేయడం జరిగిందని తెలిపారు.రైతు సంక్షేమమే దేశాభివృద్ధికి బాట వేస్తుందని పేర్కొంటూ, రైతులు బలంగా ఉంటేనే ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని ఎమ్మెల్యే అన్నారు. మొత్తం మీద 2025-26 సంవత్సరానికి గాను రాష్ట్ర వ్యాప్తంగా 8985 కోట్ల రూపాయలను సుమారు 46 లక్షల రైతులకు మూడు విడతలుగా అందిచడం జరిగింది అన్నారు.ముఖ్యంగా కోడుమూరు నియోజవర్గానికి 35052 రైతులకి సుమారు 19.72 కోట్ల రూపాయలను ఇవ్వడం జరిగిందన్నారు.రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తూ సంక్షేమాన్ని అందిస్తూ ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు.ఈ కార్యక్రమంలో కూటమి ప్రజాప్రతినిధులు,వ్యవసాయ శాఖ అధికారులు, టీడీపీ నాయకులు మరియు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గుర్రపు డెక్కల నివారణకు చర్యలు

## నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్



కర్నూలు ప్రతినిధి మహిన్యూస్ మార్చి 13: కర్నూలు నగర పరిధిలోని నదులు, కాలువల్లో గుర్రపు డెక్కల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదేశించారు.శుక్రవారం నగష్వేర ఆలయం సమీపంలోని తుంగభద్ర నది పరిసరాలు, కేవీఆర్ కళాశాల సమీపంలోని కే.సీ కెనాల్ ప్రాంతాలను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తుంగభద్ర నది, హంద్రీ నది, కే.సీ కెనాల్ ప్రాంతాల్లో గుర్రపు డెక్కల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.అవసరమైన చోట్ల డ్రోన్ సాయంతో హైపో ద్రావణాన్ని పిచికారీ చేయనున్నట్లు చెప్పారు. నీటి ప్రవాహాన్ని అడ్డుకునే చెత్త చెదారంను తిప్పల ద్వారా తొలగిస్తూ శుభ్రత పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నగరంలో ప్రజలకు ఇబ్బంది కలగకుండా గుర్రపు డెక్కల నివారణ చర్యలను వేగవంతం చేయాలని సూచించారు.కార్యక్రమంలో ఎస్ఈ రమణమూర్తి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ నాగ ప్రసాద్ బాబు, డిఈ శ్రీనివాసన్, సిబ్బంది వెంకటేశ్వర్లు, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ కింద రూ.59.28 కోట్లు జమ

గుంటూరు, మహి న్యూస్, మార్చి 13 : అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకం కింద జిల్లాలో 1,06,329 మంది రైతులకు రూ.59.28 కోట్లు జమ అయింది. అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకం మూడవ విడత కింద నిధులను శుక్రవారం విడుదల చేశారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వర్చువల్ గా నిర్వహించిన ఈ కార్యక్రమంలో అస్సాం నుండి పాల్గొనగా, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృష్ణా జిల్లా సూరంపల్లి నుండి పాల్గొన్నారు. గుంటూరు జిల్లా స్థాయి కార్యక్రమంను మేడికొండూరు మండలం పేరేచర్లలో నిర్వహించగా జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, శాసన సభ్యులు తెనాలి శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 1,06,329 మంది రైతులకు రూ.59.28 కోట్లు జమ చేయడం జరిగిందన్నారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ.42.53 కోట్లు ఉందన్నారు. 2025 - 26 సంవత్సరంలో మూడు విడతలుగా రూ.199.50 కోట్లు జమ చేయగా, అందులో రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ.148.72 కోట్లు కాగా కేంద్ర ప్రభుత్వం వాటా రూ.50.78 కోట్లుగా ఉందని వివరించారు. మొదటి, రెండవ విడతలో రూ.7 వేలు చొప్పున, మూడవ విడతలో రూ.6 వేలు చొప్పున జమ జరిగిందన్నారు. మూడు విడతలలో రూ.2 వేలు చొప్పున మొత్తం రూ.6 వేలు కేంద్రం వాటాగా జమ చేయడం జరిగిందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. డ్రోన్ సేవలు వినియోగిస్తూ తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించే దిశగా అడుగులు వేయాలని సూచించారు. శాసన సభ్యులు తెనాలి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల పక్షపాతి అన్నారు. రైతుల క్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని, అనేక కార్యక్రమాలు అమలు చేస్తుందని చెప్పారు. స్వర్ణ ఆంధ్రా విజన్ యాక్షన్ ప్లాన్ తో ప్రభుత్వం వ్యవసాయానికి అగ్రీ టెక్నాలజీ ఉపయోగిస్తూ, అధునాతన పద్ధతులు ఉపయోగించే అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకం అందించి రైతులకు ముందుగానే ఉగాది ఆనందం తీసుకువచ్చారని చెప్పారు. ఈ సందర్భంగా మెగా నమూనా చెక్కును పంపిణీ చేశారు. రైతు అవగాహన కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ ఎం.పద్మావతి, పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు కె.వి.వి సత్యనారాయణ, స్థానిక నాయకులు కోనేచర్ల శివ రామయ్య, బేతపూడి విజయశేఖర్, పాములపాటి శివన్నారాయణ, మల్లిపెద్ది రమేష్, తడవర్తి కేశవ్, ఎన్. కృష్ణ, మండవ చిన నరసింహారావు, ధనికుల వెంకట సుబ్బారావు, తలశిల ప్రసన్న కుమార్, రైతులు పాల్గొన్నారు.

# స్టేట్‌మెంట్లే... అమలు ఎక్కడ

- “మాటల్లోనే జర్నలిస్టు సంక్షేమం... అమలు ఎక్కడ?”
- “అక్రిడిటేషన్ కార్డులే లేవు... సంక్షేమ పథకాలు ఎలా?”
- “హామీలు భారీగా... జర్నలిస్టులకు లాభం మాత్రం శూన్యం”
- “జర్నలిస్టు సంక్షేమంపై ప్రకటనల వరద... అమలు మాత్రం శూన్యం”
- “రెండేళ్లుగా మాటలే... జర్నలిస్టుల సమస్యలు యథాతథం”
- “పెన్షన్, బస్ పాస్, బీమా... అన్నీ హామీలే?”
- “అధికారుల నిర్లక్ష్యం... ప్రభుత్వానికి చెడ్డ పేరు?”
- “చిన్న పత్రికలు, గ్రామీణ జర్నలిస్టులకు న్యాయం ఎప్పుడు?”
- “అక్రిడిటేషన్ ఆలస్యం... జర్నలిస్టుల అసంతృప్తి పెరుగుతోంది”
- “సంక్షేమం మాటల్లోనే... చర్యలు ఎప్పుడూ?”
- “జర్నలిస్టు సంక్షేమం -- మాటలు కాదు, చర్యలు కావాలి”




అమరావతి/ మహి న్యూస్ మార్చి 13: రాష్ట్రంలో జర్నలిస్టులు ప్రజాస్వామ్యానికి నాలుగో స్థంభంగా పనిచేస్తున్నారు. ప్రజల సమస్యలను ప్రభుత్వానికి తీసుకెళ్లే బాధ్యత జర్నలిస్టులది. కానీ అదే జర్నలిస్టులు తమ సమస్యల విషయంలో న్యాయం కోసం పోరాడాల్సిన పరిస్థితి రావడం బాధాకరం. ఇటీవల రాష్ట్ర సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి జర్నలిస్టులకు ఉగాది పురస్కారాలు, పెన్షన్, ఉచిత బస్ పాస్‌లు, ప్రమాద బీమా వంటి పథకాలు త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. అయితే గత రెండు సంవత్సరాలుగా కూడా ఇలాంటి ప్రకటనలు వినిపించినప్పటికీ వాటి అమలు మాత్రం కనిపించకపోవడం జర్నలిస్టు వర్గాల్లో సందేహాలకు కారణమైంది. జర్నలిస్టులకు కనీస గుర్తింపుగా ఉండే అక్రిడిటేషన్ కార్డులే ఇప్పటివరకు పూర్తిగా ఇవ్వలేకపోవడం పరిస్థితి ఎంత తీవ్రమో చూపిస్తోంది. మూడు నెలల చొప్పున కాలపరిమితి పొడిగిస్తూ వ్యవహారం కొనసాగడం వల్ల చిన్న పత్రికలు, గ్రామీణ జర్నలిస్టులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జర్నలిస్టులకు ఎక్కువ అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని సూచించినప్పటికీ, అమలు స్థాయిలో ఇంకా పురోగతి కనిపించడం లేదు. అలాగే డిజిటల్ మీడియా జర్నలిస్టులకు అక్రిడిటేషన్ ఇవ్వాలని మంత్రి నారా లోకేష్ సూచించినప్పటికీ, ఆ ప్రక్రియ ముందుకు సాగలేదు. ఈ పరిస్థితి కొనసాగితే జర్నలిస్టులలో అసంతృప్తి పెరగడం సహజం. జర్నలిస్టులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాకుండా, తమ హక్కుల కోసం మాత్రమే పోరాడుతున్నారు. అందుకే ప్రభుత్వం త్వరగా స్పష్టమైన విధానాన్ని ప్రకటించి, జర్నలిస్టుల సంక్షేమ పథకాలను అమలులోకి తీసుకురావడం అవసరం. రాష్ట్రంలో జర్నలిస్టు సంక్షేమంపై ప్రభుత్వం తరచూ ప్రకటనలు చేస్తూ ఉన్నప్పటికీ, వాటి అమలు మాత్రం కనిపించకపోవడం మీడియా వర్గాల్లో తీవ్ర అసంతృప్తిని రేకెత్తిస్తోంది.

### అక్రిడిటేషన్ కార్డులే ఇంకా పెండింగ్

జర్నలిస్టులకు కనీస గుర్తింపుగా ఉండే అక్రిడిటేషన్ కార్డులే ఇప్పటివరకు ఇవ్వలేకపోవడం పరిస్థితి ఎంత దురదృష్టకరంగా ఉందో చూపిస్తోంది. మూడు నెలల చొప్పున కాలపరిమితిని పొడిగిస్తూ దాదాపు ఒక సంవత్సరం పాటు అక్రిడిటేషన్ వ్యవహారం లాగడం తప్ప, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపలేకపోయారని జర్నలిస్టులు అంటున్నారు. చిన్న పత్రికలు, గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే జర్నలిస్టులు ముఖ్యంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోతున్నారు.

హామీల జాబితా పెద్దది... అమలు మాత్రం శూన్యం

ప్రభుత్వం ప్రకటించిన లేదా ప్రకటిస్తామని చెప్పిన పథకాల జాబితా పెద్దదే. కానీ వాటి అమలు మాత్రం కనిపించడం లేదని జర్నలిస్టు సంఘాలు చెబుతున్నాయి. జర్నలిస్టులకు హామీ ఇచ్చిన ముఖ్యమైన అంశాలు ఇవి: వెటరన్ జర్నలిస్టులకు పెన్షన్ పథకం, రాష్ట్రవ్యాప్తంగా ఉచిత బస్ పాస్‌లు, ప్రమాద బీమా పథకం, హెల్త్ కార్డు పరిమితిని ?20 లక్షలకు పెంపు, జర్నలిస్టులకు హౌస్ సైట్లు, ఉగాది జర్నలిస్టు పురస్కారాలు. ఈ అంశాల్లో ఒక్కటి కూడా స్పష్టమైన విధానంతో అమలులోకి రాకపోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది.

### అధికారుల నిర్లక్ష్యమే కారణమా?

జర్నలిస్టు వర్గాలు మాత్రం సమస్యకు ప్రధాన కారణం సమాచార శాఖ అధికారుల నిర్లక్ష్యమేనని ఆరోపిస్తున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గత ప్రభుత్వంతో పోలిస్తే ఎక్కువ సంఖ్యలో అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని సూచించినప్పటికీ, ఆ దిశగా చర్యలు కనిపించడం లేదని అంటున్నారు. అలాగే మంత్రి నారా లోకేష్ డిజిటల్ మీడియా, యూట్యూబ్, వెబ్‌సైట్ జర్నలిస్టులకు కూడా అక్రిడిటేషన్ ఇవ్వడానికి విధివిధానాలు రూపొందించాలని సూచించినప్పటికీ, ఇప్పటివరకు ఆ ప్రక్రియ ముందుకు సాగలేదని పేర్కొంటున్నారు.

### ప్రభుత్వానికి చెడ్డ పేరు తెస్తున్న వ్యవస్థ

జర్నలిస్టు సంఘాల అభిప్రాయం ప్రకారం, ఈ పరిస్థితి వల్ల ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తోందని అంటున్నారు. ప్రభుత్వం జర్నలిస్టులకు అనేక సంక్షేమ కార్యక్రమాలు చేయాలని సిద్ధంగా ఉన్నప్పటికీ, అమలు స్థాయిలో అధికారుల వైఫల్యం వల్ల అవి నిలిచిపోతున్నాయని విమర్శిస్తున్నారు.

### పోరాటం ప్రభుత్వానికి వ్యతిరేకం కాదు

నేషనల్ యాక్టివ్ రిపోర్టర్స్ అసోసియేషన్ నాయకులు స్పష్టం చేస్తూ, తమ పోరాటం ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాదని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నాయకత్వంపై తమకు గౌరవం ఉందని తెలిపారు. జర్నలిస్టులకు న్యాయం జరగాలనే ఉద్దేశంతోనే సమస్యలను లేవనెత్తుతున్నామని చెప్పారు.

### ఇక చర్యల సమయం:

జర్నలిస్టు వర్గాల అభిప్రాయం ప్రకారం, ఇప్పటికైనా ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయాలు తీసుకుని జర్నలిస్టు సంక్షేమ పథకాలను అమలులోకి తీసుకురావాలి. చిన్న పత్రికలు, గ్రామీణ జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకపోతే అసంతృప్తి మరింత పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. అవసరమైతే అన్ని జర్నలిస్టు సంఘాలను కలుపుకుని సమస్యలకు పరిష్కారం కనుగొనేందుకు సిద్ధంగా ఉన్నామని నేషనల్ యాక్టివ్ రిపోర్టర్స్ అసోసియేషన్ పేర్కొంది.

# గిరిజనుల అభివృద్ధికి జిల్లా అధికారులు తోడ్పడాలి

## రాష్ట్ర ఎస్టీ కమిషన్ మెంబర్ పి.వెంకటప్ప

కర్నూలు, మహి న్యూస్, మార్చి 13 :- గిరిజనుల హక్కుల పరిరక్షణ, తప్పుడు ఎస్టీ సర్టిఫికేట్లపై విచారణ -- విద్య, సంక్షేమం మరియు మౌలిక సదుపాయాల అభివృద్ధిపై అధికారులకు సూచనలు చేసిన ఎస్టి కమిషన్ మెంబర్ పి.వెంకటప్ప శుక్రవారం మధ్యాహ్నం కర్నూల్ స్టేట్ గెస్ట్ హౌస్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా అధికారులు మరియు డివిజన్ అధికారుల సమావేశాన్ని రాష్ట్ర ఎస్టీ కమిషన్ మెంబర్ పి వెంకటప్ప నిర్వహించారు. ఈ సందర్భంగా మెంబర్ పి.వెంకటప్ప మాట్లాడుతూ... రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు కర్నూల్ జిల్లాలోని గిరిజనులకు ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సౌకర్యాలు అందే చర్యలు జిల్లా అధికారులు తీసుకోవాలని వాటిని ఎస్టీ కమిషన్ మెంబర్గా పర్యవేక్షించమని నన్ను నియమించడం జరిగిందని కావున జిల్లాలోని అధికారులు గిరిజనుల అభ్యున్నతికి కృషి చేయాలని కోరారు. ఈ సమీక్ష సమావేశంలో కర్నూలు జిల్లా లో గిరిజనుల హక్కుల పరిరక్షణ, తప్పుడు ఎస్టీ సర్టిఫికేట్ల జారీపై విచారణ, అలాగే గిరిజన ప్రాంతాల అభివృద్ధి అంశాలపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించబడింది. ఈ సందర్భంగా జిల్లాలో కొంతమంది వ్యక్తులు తప్పుడు ఎస్టీ సర్టిఫికేట్లు పొందినట్లు సమాచారం అందుతున్న నేపథ్యంలో డీఎంసీ సభ్యులు, ఎస్ ఎస్ఏ పి ఓ మరియు డీటిడబ్ల్యూఓ కలిసి సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని సమగ్ర విచారణ చేపట్టి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కర్నూలు రైతు బజార్లో ఎస్టీలకు కూడా వ్యాపారం చేసుకోవడానికి అవకాశం కల్పించాలని ఎస్టేట్ ఆఫీసర్లను కోరారు. అటవీ ప్రాంతాల్లో, ముఖ్యంగా రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజనుల హక్కులను పరిరక్షించడం ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. ఈ ప్రాంతాల్లో నివసించే గిరిజనుల సమస్యలను పరిగణలోకి తీసుకుని అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతాల్లో రోడ్లు, విద్యుత్ హై టెన్షన్ లైన్లు వంటి అభివృద్ధి పనులు చేపట్టేటప్పుడు చట్టపరమైన నిబంధనలు పాటిస్తూ స్థానిక గిరిజనులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఓటీఆర్ఐ పరిధిలో ఉన్న పాఠశాలలు మరియు హాస్టళ్లలో విద్యార్థులకు మెరుగైన విద్యా సదుపాయాలు కల్పిస్తున్నట్లు అధికారులు తెలిపారు. గత విద్యాసంవత్సరంలో ఎస్సీఎస్సీ పరీక్షల్లో 98.90 శాతం ఉత్తీర్ణత సాధించి మంచి ఫలితాలు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. మొత్తం 560 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, వారికి అవసరమైన విద్యా సదుపాయాలు, మార్గదర్శక కార్యక్రమాలు అందించామని తెలిపారు. విద్యార్థులకు 1062 జతల ఎస్.యూ. డ్రెస్‌లు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. విద్యార్థులు వంద శాతం ఫలితాలు సాధించేలా ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఇప్పటివరకు సుమారు రూ.72 లక్షలను కలెక్టివ్ ఫండ్‌గా సమీకరించి విద్యార్థుల అభివృద్ధి కోసం వినియోగిస్తున్నామని అధికారులు తెలిపారు. ప్రతి విద్యార్థి విద్యా ప్రగతిని ప్రత్యేకంగా పర్యవేక్షిస్తూ మెరుగైన ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని, జిల్లాలో నీరు, రోడ్లు వంటి మౌలిక సదుపాయాల సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని సూచించారు. ముఖ్యంగా మద్దికేర, తుగ్గలి, కర్నూలు రూరల్ ప్రాంతాల్లో స్మశానాలు, తాగునీరు, రోడ్డు వంటి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని, ఎస్టీ వర్గాలకు ఇళ్లు నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని, ఎవరూ ఇల్లు లేకుండా ఉండకూడదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ మాట్లాడుతూ ఎస్ టి రైతులకు 100 శాతం సబ్సిడీపై అందిస్తున్న పథకాల గురించి వివరించారు. అలాగే సీడ్ క్యాంప్ కార్యక్రమం ద్వారా 20 మంది అభ్యర్థులను ఎంపిక చేసి వారికి సుమారు రూ.10 లక్షల వరకు ఆర్థిక సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఆర్డీఓ ద్వారా భూమి మరియు గృహ స్థలాలకు సంబంధించిన అంశాలు, ముఖ్యంగా ఎస్టీ వర్గాలకు సంబంధించిన సమస్యలపై కూడా సమావేశంలో చర్చించారు. గ్రామీణ ప్రాంతాల్లో సివిల్ హక్కుల దినోత్సవం కార్యక్రమాలను నిర్వహించి ప్రజల్లో చైతన్యం కల్పించాలని అధికారులు సూచించారు. ఈ. సమావేశానికి కర్నూలు ఆర్డీఓ సందీప్, జెడ్పీ సీఈఓ నాసర రెడ్డి , ఎంప్లాయ్మెంట్ ఆఫీసర్ దీప్తి , పశుసంవర్ధక శాఖ ఏడి హేమంత్ కుమార్ , ఐసీడీఎస్ పి.డి విజయ , డీటీసీ శాంత కుమారి , డీటిడబ్ల్యూఓ సురేష్ మరియు ఫిషరీస్, ట్రేజరీ, శాఖకు చెందిన డిప్యూటీ డైరెక్టర్ తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ప్రతిరోజు మొండి బకాయిదారుల ఆస్తులు జప్తు

## నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్



కర్నూలు ప్రతినిధి మహిన్యూస్ మార్చి 13: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగియడానికి మరికొన్ని రోజులు మాత్రమే మిగిలి ఉన్న నేపథ్యంలో,ఇకపై దీర్ఘకాలంగా పన్నులు చెల్లించని మొండి బకాయిదారులపై కఠిన చర్యలు తీసుకుని ప్రతిరోజు ఆస్తుల జప్తు ప్రక్రియ చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదేశించారు.శుక్రవారం స్థానిక ఎస్బీఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో రెవెన్యూ విభాగ సిబ్బంది, అడ్మిన్‌లతో నిర్వహించిన సమావేశంలో పన్ను వసూళ్ల పురోగతిపై సమీక్ష చేపట్టారు. ఆర్ఐలు, సచివాలయాల వారీగా వసూళ్ల పురోగతిపై సమీక్షించి, లక్ష్యాలను త్వరితగతిన సాధించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.టాప్‌లో ఉన్న మొండి బకాయిదారుల ఆస్తులను సీజ్ చేయాలని, ఎలాంటి ఒత్తిడిలకు తలొగ్గొద్దని స్పష్టం చేశారు.కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్‌జివి కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, ఆర్వోలు జునైద్, స్వర్ణలత, వాజిద్, ఆర్ఐలు, తదితరులు పాల్గొన్నారు.

# గుంతల రహిత రహదారులే లక్ష్యం

## నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్



కర్నూలు ప్రతినిధి మహిన్యూస్ మార్చి 13: నగర పరిధిలో గుంతల రహిత రహదారులే ప్రభుత్వ లక్ష్యమని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ తెలిపారు. శుక్రవారం ఆయన కృష్ణనగర్ ఐటీసీ, గుత్తి పెట్రోల్ బంక్ ప్రాంతాల్లో జరుగుతున్న గుంతల పూడ్చివేత పనులను పరిశీలించారు. నగరంలోని రహదారులపై ఏర్పడిన గుంతలను గుర్తించి వేగంగా పూడ్చివేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర పరిధిలో రూ.87 లక్షల వ్యయంతో మొత్తం 487 గుంతలను పూడ్చివేస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడేలా రహదారుల మరమ్మతు పనులు వేగంగా పూర్తి చేస్తున్నట్లు పేర్కొన్నారు.అదేవిధంగా వీకర్ సెక్షన్ కాలనీలో డ్రైనేజీ కాలువల్లో ఉన్న తాగునీటి పైపులైన్లను పరిశీలించారు. నగరంలో వీలైనంత త్వరగా తాగునీటి పైపులను మార్చాలని,ట్యాప్ పైపులు ఉన్న చోట్ల సంబంధిత యజమానుల నుండి సామాగ్రి తీసుకుని మార్పులు చేయాలని సూచించారు.అతిసారం ప్రబలకుండా తీసుకుంటున్న చర్యలకు ప్రజలు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎస్ఈ రమణమూర్తి, ఎంఈ మనోహర్ రెడ్డి, గిరిరాజ్, ఏఈ ప్రవీణ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

RNI : APTEL/25/A0108
మహి న్యూస్
epaper: https://epaper.mahinewsindia.com
తెలుగు దినపత్రిక
శనివారం - 14 - మార్చి - 2026

## పలాస కేంద్రీయ విద్యాలయలో తరగతులు షురూ..!!



శ్రీకాకుళం, మహి న్యూస్, మార్చి 13 : శ్రీకాకుళం జిల్లా, పలాసలో కేంద్రీయ విద్యాలయ తరగతులు 2026-27 విద్యా సంవత్సరం నుండి ప్రారంభం అవుతున్నట్టు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఇందుకు సంబంధించి కేంద్ర విద్యా శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న కేంద్రీయ విద్యాలయ సంగతాన్ నుండి శుక్రవారం నాడు అధికారిక ఉత్తర్వులు వెలువడినట్లు తెలిపారు. ఆ ఉత్తర్వుల ప్రకారం కేంద్రీయ విద్యాలయ పాఠశాలను పలాసలో ఏర్పాటుకు గత సంవత్సరం అక్టోబర్ మూడవ తేదిన అనుమతులు ఇచ్చినట్టు తెలిపారు. తరువాత పాఠశాల ఏర్పాటుకు అవసరమైన భూములు, ఇతర భవనాలు, వసతుల కోసం పలు కమిటీలు క్షేత్ర స్థాయి పరిశీలనలు చేసినట్టు పేర్కొన్నారు. భూముల బదలాయింపు మరియు తాత్కాలిక తరగతుల నిర్వహణ కోసం వసతుల పరిశీలన పూర్తిగా జరిగిన నేపథ్యంలో రాబోయే విద్యా సంవత్సరం 2026-27 తరగతుల నిర్వహణ ప్రారంభిస్తున్నట్టు ఉత్తర్వులలో స్పష్టం చేశారు. ప్రస్తుతానికి ఒకటి నుండి అయిదవ తరగతి వరకు.. ప్రతీ తరగతికి ఒక సెక్షన్ చొప్పున ప్రవేశాలు తీసుకుంటున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా ఇదివరకే స్థానిక అధికారులతో కలిసి ఈ ఏడాది ఫిబ్రవరి 17న పలాస రైల్వే కాలనీలోని ఆర్.పి.ఎఫ్ బారక్స్ ను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పరిశీలన చేసి అవసరమైన సూచనలు చేశారు. రైల్వే అధికారులతో మాట్లాడి.. వారి నుండి కేంద్రీయ విద్యాలయ కు గదుల బదిలీకి శాఖాపరమైన ప్రక్రియ వేగవంతం చెయ్యాలని స్పష్టం చేశారు. అనంతరం నెమలికొండ ప్రాంతంలో కేంద్రీయ విద్యాలయ ప్రతిపాదిత స్థలాన్ని సైతం క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు. తాజాగా తరగతుల నిర్వహణకు ఉత్తర్వులు విడుదలైన నేపథ్యంలో రామ్మోహన్ నాయుడు ఆనందం వ్యక్తం చేశారు. శ్రీకాకుళం జిల్లా పలాస పరిసర ప్రాంతాల వారితో పాటు.. జిల్లాలోని సాయుధ దళాల సిబ్బందికి, కేంద్ర సంస్థల ఉద్యోగులకు పలాసలో కేంద్రీయ విద్యాలయ ఏర్పాటు ద్వారా పిల్లలకు నాణ్యమైన విద్యా అవకాశాలు లభిస్తాయని అన్నారు. కాగా రామ్మోహన్ నాయుడు చొరవతో.. ఇప్పటికే ఒక కేంద్రీయ విద్యాలయ ఉన్న శ్రీకాకుళం జిల్లాలో స్థానికులకు సేవలధించేందుకు వీలుగా పలాసలో మరొకటి ఏర్పాటు కాబోతు ఉండటం.. ఈ విద్యా సంవత్సరం నుండి తరగతులు సైతం ప్రారంభం కాబోతుండటం పట్ల జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## నేడు బీసీ రక్షణ చట్టంపై కీలక భేటీ

### బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



అమరావతి, మహి న్యూస్, మార్చి 13 : వెనుకబడిన తరగతులు గౌరవ ప్రదమైన జీవనం సాగించడంలో భాగంగా బీసీ రక్షణ చట్టం రూపకల్పనపై నేడు జరగనున్న కీలక సమావేశం నిర్వహించనున్నట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్ .సవిత తెలిపారు. ఈ సమావేశంలో బీసీ మంత్రులతో పాటు రాష్ట్ర మైనార్టీ, న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, హోం మంత్రి అనిత పాల్గొనబోతున్నారన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల్లో హామీలో భాగంగా వెనుకబడిన తరగతులకు గౌరవ ప్రదమైన జీవనం అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. దీనిలో భాగంగా బీసీ రక్షణ చట్టం రూపకల్పనపై ఇప్పటికే బీసీ మంత్రులు రెండు పర్యాయాలు భేటీ అయ్యామన్నారు. మూడోసారి విజయవాడ నగరం తాడిగడపలోని బీసీ వెల్ఫేర్ డైరెక్టరేట్ లో శనివారం కీలక సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో తనతో పాటు మంత్రులు కొల్లు రవీంద్ర, అనగాని సత్యప్రసాద్, కింజరాపు అచ్చెన్నాయుడు, కొలుసు పార్థసారథి, వాసంశెట్టి సుభాశ్, కొండపల్లి శ్రీనివాస్, సత్యకుమార్ పాల్గొంటున్నారన్నారు. బీసీ మంత్రులతో పాటు రాష్ట్ర మైనార్టీ, న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, హోం మంత్రి అనిత, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ బీద రవిచంద్రయాదవ్ తో పాటు న్యాయ శాఖ కార్యదర్శి, బీసీ వెల్ఫేర్ కార్యదర్శి కూడా ఈ సమావేశానికి హాజరుకానున్నట్లు తెలిపారు. బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేసి తీరుతామని మంత్రి సవిత స్పష్టంచేశారు.

## ప్రకాశం జిల్లాలో పారఖ్ జాతీయ సర్వేక్షణ 2024 ఫలితాలపై అవగాహన శిక్షణ




ఒంగోలు, మహి న్యూస్, మార్చి 13: పాఠశాల విద్యా శాఖ ఆధ్వర్యంలో పారఖ్ జాతీయ సర్వేక్షణ--2024 ఫలితాలపై అవగాహన కల్పించే రెండు రోజుల శిక్షణా కార్యక్రమం ఒంగోలు నగరంలోని క్యూఐఎస్ కళాశాలలో ప్రారంభమైంది. ఈ శిక్షణ కార్యక్రమం మార్చి 13 నుండి 14 వరకు రెండు రోజుల పాటు నిర్వహించబడుతోంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా విద్యాశాఖాధికారి సి.వి. రేణుకా ప్రారంభోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ స్థాయిలో నిర్వహించిన పారఖ్ సర్వేక్షణ ఫలితాలను పాఠశాల స్థాయిలో సమర్థవంతంగా అమలు చేసి విద్యార్థుల అభ్యాస నైపుణ్యాలను మెరుగుపరచడం అత్యంత అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీఈబీ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు, ఏఎంఓ నాగేంద్ర నాయక్, మార్కాపురం డీవైఈఓ మావిళ్లపల్లి శ్రీను పాల్గొని ఉపాధ్యాయులకు మార్గదర్శనం చేశారు. జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్లుగా డైట్ సీనియర్ లెక్చరర్లు విజయకృష్ణ, సర్దార్ పాపారాయుడు శిక్షణ అందిస్తున్నారు. వీరితో పాటు రిసోర్స్ పర్సన్లుగా సోమశేఖర్, శ్రీమతి యామిని, శ్రీమతి పద్మశ్రీ కూడా శిక్షణలో పాల్గొని వివిధ అంశాలపై ఉపాధ్యాయులకు వివరించారు. ఈ రెండు రోజుల శిక్షణలో జిల్లాలోని వివిధ మండలాల నుండి మాండలిక విద్యాధికారులు , క్లస్టర్ హెచ్ఎంలు, స్కూల్ అసిస్టెంట్లు మరియు ఎస్జీటీలు పాల్గొంటున్నారు. పారఖ్ జాతీయ సర్వేక్షణలో గుర్తించిన విద్యార్థుల అభ్యాస స్థాయిలు, లోపాలు మరియు వాటి ఆధారంగా పాఠశాలల్లో తీసుకోవాల్సిన చర్యలపై శిక్షణలో చర్చించారు. ఈ కార్యక్రమం ద్వారా ఉపాధ్యాయులు విద్యార్థుల అభ్యాసాన్ని విశ్లేషించి, బోధన విధానాలను మెరుగుపరచడానికి అవసరమైన అవగాహన పొందుతారని నిర్వాహకులు తెలిపారు.

## ప్రకాశం భవనంలో ఘనంగా తెలుగు కవయిత్రి మొల్లమాంబ 586వ జయంతి



ఒంగోలు, మహి న్యూస్, మార్చి 13 : సాహిత్యరంగంపై మొల్లమాంబ తనదైన ముద్ర వేశారని జిల్లా రెవెన్యూ అధికారి బి.చిన ఓబులేసు కొనియాడారు. తొలి తెలుగు కవయిత్రి మొల్లమాంబ 586వ జయంతి ఉత్సవం శుక్రవారం ప్రకాశం భవనంలో ఘనంగా జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారికంగా నిర్వహించిన ఈ ఉత్సవములో జిల్లా బిసి సంక్షేమ అధికారి నిర్మల జ్యోతి, బిసి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు, పలువురు కవయిత్రులు, శాలివాహన సంఘం ప్రతినిధులు పాల్గొని మొల్లమాంబ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ సాహిత్య రంగంలో మొల్లమాంబ సేవలను కొనియాడారు. ఒంగోలులో ఆమె విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు అధికార యంత్రాంగం తరపున సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. శాలివాహన సంఘము ఆధ్వర్యంలో ప్రకాశం భవనంలో ప్రత్యేక చలివేంద్రం ఏర్పాటు చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సంస్కృతంలో ఉన్న రామాయణాన్ని తెలుగులోకి అందుబాటులోకి తీసుకురావటం మొల్లమాంబ ప్రతిభకు నిదర్శనం అన్నారు. బిసి సామాజిక వర్గాలకు ఆదరణ పథకం ద్వారా సబ్సిడీతో రుణాలు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. నిర్మల జ్యోతి మాట్లాడుతూ మొల్లమాంబ జీవిత చరిత్రను వివరించారు. ఈ కార్యక్రమంలో నవ్యాంధ్ర రాష్ట్ర రచయితల సంఘం గౌరవ అధ్యక్షురాలు తేళ్ల అరుణ, ఉపాధ్యక్షురాలు సింహాద్రి జ్యోతిర్మయి, ప్రకాశం జిల్లా అధ్యక్షురాలు పరాంకుశం కృష్ణవేణి, గాయని చల్లా నాగేశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు. శాలివాహన సామాజిక వర్గానికి చెందిన ప్రముఖులైన ఐలాపురం వెంకయ్య, ' విక్కీ ' నాగేశ్వరరావు మృతికి సంతాపంగా ఈ కార్యక్రమంలో రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు.

# రైతు సంతోషమే రాష్ట్ర సుభిక్షం

అమరావతి/సూరంపల్లి, మహి న్యూస్, మార్చి 13: రైతు సంతోషంగా ఉంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని, రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. మరికొద్ది రోజుల్లో ఉగాది సందర్భంగా రాష్ట్ర రైతాంగానికి అన్నదాత సుఖీభవ 3.0 ద్వారా ఆర్థిక సాయం అందించడం ప్రభుత్వం రైతుల పట్ల ఉన్న నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. కృష్ణా జిల్లా గన్నవరం నియోజకవర్గం సూరంపల్లిలో జరిగిన అన్నదాత సుఖీభవ నిధుల విడుదల కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ ఈ విడతలో రాష్ట్రవ్యాప్తంగా 46.85 లక్షల మంది రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటాలు కలిపి ఒక్కో రైతు ఖాతాలో రూ.6,000 చొప్పున జమ చేసామని చెప్పారు. ఈ విడత కోసం కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి రూ.2,676 కోట్లు ఖర్చు పెట్టాయని వెల్లడించారు. కూటమి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం ఏడాదికి రూ.20 వేల ఆర్థిక సాయం అందించామని మంత్రి తెలిపారు. ఇప్పటికే 2025 ఆగస్టు 2న మొదటి విడతగా రూ.7 వేల చొప్పున రూ.3,174 కోట్లు, నవంబర్ 19న రెండో విడతగా రూ.7 వేల చొప్పున రూ.3,135 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు పేర్కొన్నారు. శుక్రవారం ఇచ్చిన రూ.6 వేలతో కలిపి రైతులకు ఏడాదికి హామీ ఇచ్చిన రూ.20 వేల సాయం పూర్తయిందని తెలిపారు. ఈ పథకం రైతులకు వ్యవసాయ పెట్టుబడులకు బలంగా నిలుస్తూ రైతుల జీవితంలో నమ్మకాన్ని పెంచిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 46,85,838 మంది రైతులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారని మంత్రి వెల్లడించారు. రైతులకు అవసరమైన ఎరువులు సకాలంలో అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, కేంద్రంతో సమన్వయం చేసుకుంటూ ఎరువుల కొరత లేకుండా చూస్తున్నామని తెలిపారు. సబ్సిడీలపై వ్యవసాయ పరికరాలు అందిస్తూ వ్యవసాయంలో సాంకేతికతను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వ కాలంలో నిర్లక్ష్యానికి గురైన సాగునీటి ప్రాజెక్టులను కూటమి ప్రభుత్వం పునరుద్ధరిస్తోందని మంత్రి తెలిపారు.

పోలవరం, వెలిగొండ వంటి ప్రాజెక్టులను పూర్తి చేసి రాష్ట్రానికి అంకితం చేయడానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసిన 24 గంటల్లోనే వారి ఖాతాల్లో డబ్బులు జమ చేసే విధానాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రకృతి విపత్తుల సమయంలో రైతులను ఆదుకునేందుకు ఇన్‌పుట్ సబ్సిడీలుగా సుమారు రూ.310 కోట్లు చెల్లించామని, ఉల్లి, కోకో వంటి పంటలకు ధరల స్థిరీకరణ నిధి కింద రూ.588 కోట్లు ఖర్చు చేసినట్లు మంత్రి చెప్పారు. 2026--27 రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ.53,752.12 కోట్లు కేటాయించి రైతు ప్రాధాన్య ప్రభుత్వంగా నిలిచామని మంత్రి తెలిపారు. సాంకేతిక కారణాల వలన ఇబ్బంది పడిన హెల్డోవర్ సాగు రైతులను కూడా అన్నదాత సుఖీభవ పరిధిలోకి తీసుకొచ్చామని అన్నారు. రైతు సంతోషంగా ఉంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని, రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

# రైతుకు వెన్నుదన్నుగా ప్రభుత్వం

## ఆర్డీఓ ఎమ్.కృష్ణమూర్తి



సంతబొమ్మాళి, మహి న్యూస్, మార్చి 13: ఆరుగాలం శ్రమించే రైతులకు పెట్టుబడి సాయం అందించి ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తుందని రెవెన్యూ డివిజనల్ అధికారి యం. కృష్ణమూర్తి అన్నారు. సంతబొమ్మాళి మండల పరిషత్ కార్యాలయ ఆవరణ వద్ద వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అన్నదాత సుఖీ భవ పి ఎం కిసాన్ మూడవ విడత నిధుల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పంట మార్పిడి పై దృష్టి సారించి తక్కువ పెట్టుబడి తో అధిక ఆదాయం వచ్చేదిగా ఆలోచన చేయాలని కోరారు. పంటల సాగులో వ్యవసాయ అధికారులు సలహాలు పాటించి వ్యవసాయ యాజమాన్య పద్ధతులు అవలంబిస్తే మరింత మేలు చేకూరుతుందని సూచించారు. ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయానికి తోడ్పాటు నిస్తుందని, యూరియా వాడకం తగ్గించే ఆలోచన చేస్తుందని తద్వారా భూసారం తో పాటు పంట సాగు లాభదాయకం అవుతుందని అన్నారు. వచ్చే ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలు ప్రక్రియలో కొద్దిపాటి సమస్యలను అధిగమించి రైతులకు మరింత లబ్ధి చేకూర్చనున్నట్లు తెలిపారు. ఆఫ్ షోర్ రిజర్వాయర్ నుంచి 1 టి ఎం సి క్యాచ్మెంట్ ద్వారా నందిగామ మండలం రైతులకు పదివేల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కృషి చేస్తున్నారని వెల్లడించారు. జిల్లాలో ప్రతి ఎకరాకు సాగునీరు అందించే విధంగా ప్రణాళికతో మంత్రి చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం అందిస్తున్న పెట్టుబడి సాయాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. నియోజకవర్గంలోని 41961 మంది రైతు కుటుంబాలకు అన్నదాత సుఖీ భవ పీ ఎం కిసాన్ కింద రూ.24.27 కోట్ల నమూనా చెక్కు ను ఆర్డీఓ పంపిణీ చేశారు. అనంతరం టెక్కలి, నరసన్నపేట నియోజకవర్గాలకు జలజీవన్ మిషన్ కింద తాగునీరు అందించేందుకు రూ.1202 కోట్ల నిధులను మంజూరు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, వ్యవసాయ శాఖ మంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కేక్ కట్ చేసి కృతజ్ఞతను, అభినందనలు తెలిపారు. ప్రకృతి వ్యవసాయంలో ఆదర్శంగా నిలిచిన రైతు తంగి రమణమూర్తిని దుస్సాలువతో సన్మానించారు.

### అన్నదాత సుఖీ భవ పి ఎం కిసాన్ కార్యక్రమం కింద

టెక్కలి నియోజక వర్గంలోని నందిగాం మండలంలోని 10427 మంది రైతులకు రూ.603 లక్షలు, టెక్కలి 8213 మంది రైతులకు రూ.483 లక్షలు, కోటబొమ్మాళి 11738 మంది రైతులకు రూ.679 మంది రైతులకు రూ.679 లక్షలు, సంతబొమ్మాళి 11583 మంది రైతులకు రూ.661 లక్షలు, వెరసి నియోజక వర్గంలోని మొత్తం 41961మంది రైతులకు రూ.2428 లక్షలు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోటబొమ్మాళి వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షులు బగాది శేషగిరిరావు, పీ ఏ సి ఎస్ అధ్యక్షులు వెలమల విజయ లక్ష్మీ, నందిగాం పి ఏ సి ఎస్ అధ్యక్షులు పినకాన అజయ్ కుమార్, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు జగన్నాథ్, ఉద్యాన వన శాఖ సహాయ సంచాలకులు చంద్ర శేఖర్, ఎమ్ పిడి ఓ జయంత్ ప్రసాద్, తహసీల్దార్ హేమసుందర్, టెక్కలి, సంతబొమ్మాళి, నందిగాం, కోటబొమ్మాళి వ్యవసాయ శాఖ అధికారులు శ్రీనివాసరావు, అప్పారావు, శ్రీకాంత్ వర్మ, గోవిందరావు, రైతులు, తదితరులు, పాల్గొన్నారు

## కాకినాడ జిల్లాలో 1,50,475 మంది రైతుల ఖాతాల్లో రూ.84.80 కోట్లు జమ

### అన్నదాత సుఖీభవ కింద 1,50,475 మందికి రూ.60.19 కోట్లు



కాకినాడ, మహి న్యూస్, మార్చి 13 : రైతులకు ప్రభుత్వం అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ యోజన పథకాల కింద గణనీయమైన ఆర్థిక సహాయం రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం జరిగిందని ఈ ఆర్థిక సహాయాన్ని రైతులందరూ చేసుకోవాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి తెలిపారు. శుక్రవారం పెదపూడి మండలం, కరకుదురు గ్రామం రైతు సేవా కేంద్రంలోని "అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకం" 3వ విడత ప్రారంభోత్సవం కార్యక్రమంలో గౌరవ దేశ ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ను రైతులతో కలిసి జిల్లా కలెక్టర్ షణ్మోహన్ వీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా రైతుల ఖాతాల్లో నేరుగా నిధులు జమ చేయడం జరిగింది. వివిధ నియోజక వర్గాల పరిధిలో స్థానిక శాసన సభ్యులు, ప్రజా ప్రతినిధులు సమక్షంలో అదే విధంగా రైతు సేవా కేంద్రాల స్థాయిలో ప్రత్యక్ష ప్రసారం ద్వారా నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. గన్నవరం నియోజకవర్గం సూరంపల్లిలో పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొనగా,పీఎం కిసాన్ నిధులు విడుదల సందర్భంగా గౌహతి నుంచి ప్రధాని నరేంద్ర మోదీ కార్యక్రమాన్ని వర్చువల్ గా వీక్షించారు. ప్రధాని ప్రసంగం అనంతరం రైతులను ఉద్దేశించి సీఎం చంద్రబాబు నాయుడు ప్రసంగించారు. అనంతరం కాకినాడ జిల్లాకు సంబంధించి అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ 3వ విడత కింద 1,50, 475 మంది రైతులకు రూ.84.80 కోట్లతో కూడిన మెగా చెక్కును స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు చేతులు మీదుగా రైతులకు జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అందజేసారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ.. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు నేడు విడుదల చేసిన అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ ఆర్థిక సహాయం రబీ సీజన్ లో రైతులకు ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. ప్రభుత్వం రైతులకు అందిస్తున్న ఆర్థిక సహాయం అత్యంత పారదర్శకంగా రైతుల బ్యాంకు ఖాతాలకు నేరుగా జమ చేయడం జరిగిందన్నారు. జిల్లాలో రానున్న రోజుల్లో మరింతమంది రైతులు హార్టికల్చర్ పంటల సాగుపైన, ప్రకృతి వ్యవసాయం పైన ప్రధానంగా దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఇందుకు జిల్లాలోని రైతాంగానికి పూర్తి సహాయ సహకారాలు అందించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

కరకుదురు గ్రామంలో రైతు సేవ కేంద్రం పరిధిలో 553 మంది రైతులకు అన్నదాత సుఖీభవ- పీఎం కిషన్ లబ్దిచేకూరింది.

నియోజకవర్గం వారిగా అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ లబ్ధి వివరాలు..

కాకినాడ రూరల్ నియోజకవర్గంలో 10,076 మంది రైతులకు రూ.5.82 కోట్లు, అలాగే పీఎం కిసాన్ యోజన కింద 8,952 మంది రైతులకు రూ.1.79 కోట్లు, కాకినాడ (అర్బన్) నియోజకవర్గంలో అన్నదాత సుఖీభవ పథకం కింద 111 మంది రైతులకు రూ.0.07 కోట్లు జమ కాగా, పీఎం కిసాన్ యోజన కింద 133 మంది రైతులకు రూ.0.03 కోట్లు జమయ్యాయి. పిఠాపురం నియోజకవర్గంలో అన్నదాత సుఖీభవ కింద 23,105 మంది రైతులకు రూ.12.71 కోట్లు,పీఎం కిసాన్ కింద 17,347 మంది రైతులకు రూ.3.47 కోట్లు జమయ్యాయి. తుని నియోజకవర్గంలో అన్నదాత సుఖీభవ పథకం కింద మొత్తం 27,617 మంది రైతులకు రూ.15.31 కోట్లు జమయ్యాయి. పీఎం కిసాన్ యోజన కింద 21,304 మంది రైతులకు రూ.4.26 కోట్లు జమయ్యాయి. ప్రత్తిపాడు నియోజకవర్గంలో అన్నదాత సుఖీభవ కింద 31,634 మంది రైతులకు రూ.17.66 కోట్లు జమ కాగా, పీఎం కిసాన్ కింద 25,026 మంది రైతులకు రూ.5.01 కోట్లు జమయ్యాయి. పెద్దాపురం నియోజకవర్గంలో 14,921 మంది రైతులకు రూ.8.53 కోట్లు చొప్పున అన్నదాత సుఖీభవ పథకం కింద జమయ్యాయి. పీఎం కిసాన్ యోజన కింద 12,791 మంది రైతులకు రూ.2.56 కోట్లు జమయ్యాయి. జగ్గంపేట నియోజకవర్గంలో 23,115 మంది రైతులకు రూ.13.24 కోట్లు అన్నదాత సుఖీభవ పథకం జమయ్యాయి. అలాగే పీఎం కిసాన్ యోజన 19,953 మంది రైతులకు రూ.3.99 కోట్లు జమయ్యాయి. ముమ్మిడివరం నియోజకవర్గ పరిధిలోని తాళ్ళరేవు మండలంలో 4,036 మంది రైతులకు రూ.2.33 కోట్లు, అన్నదాత సుఖీభవ పథకం కింద జమయ్యాయి. అలాగే పీఎం కిసాన్ యోజన కింద 3,579 మంది రైతులకు రూ.0.72 కోట్లు జమయ్యాయి. -అనపర్తి నియోజకవర్గం పరిధిలో పెదపూడి మండలం లో 6,996 మంది రైతులకు రూ.4.04 కోట్లు అన్నదాత సుఖీభవ పథకం కింద జమయ్యాయి. అలాగే పీఎం కిసాన్ యోజన కింద 6,230 మంది రైతులకు రూ.1.25 కోట్లు జమ చేశారు. రామచంద్రాపురం నియోజకవర్గం పరిధిలోనీ కాజులూరు మండలంలో 8,865 మంది రైతులకు అన్నదాత సుఖీభవ కింద రూ.5.09 కోట్ల ఆర్థిక సహాయం అందింది.పీఎం కిసాన్ కింద 7,730 మంది రైతులకు రూ.1.55 కోట్లు జమ అయ్యింది. మొత్తంగా కాకినాడ జిల్లా పరిధిలో పీఎం కిసాన్ యోజన కింద 1,23,045 మంది రైతులకు రూ.24.61 కోట్లు, అన్నదాత సుఖీభవ పథకం కింద 1,50,475 మంది రైతులకు రూ.60.18 కోట్లు జమ కాగా, ఈ రెండు పథకాల ద్వారా కలిపి రైతులకు మొత్తం రూ. 84.80 కోట్ల ఆర్థిక సహాయం అందినట్లు జిల్లా కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడిఏ కె.దుర్గాలక్ష్మి, ఏఓ ఎన్.సత్యప్రసాద్, పెదపూడి మండలం తహసీల్దార్ పీవీ. సీతాపతి రావు, ఎంపీడీవో నరేంద్ర రెడ్డి, డిసి చైర్మన్ సానా శ్రీనివాసరావు, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ సింగినీడి నాగ తిరుపతిరావు, బిజెపి నాయకులు తోటకూర వెంకటేశ్వరరావు, జనసేన ప్రతినిధులు పాఠశెట్టి కాశీరాణి, పాఠంశెట్టి త్రిమూర్తులు, కరకుదురు వీఏఏ ఎండీ అఫ్జల్ హుస్సేన్, గ్రామంలోని రైతులు తదితరులు పాల్గొన్నారు.

## వై ఎస్ ఆర్ కడప జిల్లాలో 1,94,047 మంది రైతులకు రూ.113.7 కోట్ల నిధులు విడుదల









వై ఎస్ ఆర్ కడప,మహి న్యూస్ మార్చి13: ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం "అన్నదాత సుఖీభవ" పథకం 3వ విడత మరియు "పి.ఎం. కిసాన్" పథకం 22వ విడత నిధులను అర్హులైన రైతులందరి ఖాతాలలో శుక్రవారం జమ చేసింది. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాల మేరకు, జిల్లాలోని అన్ని నియోజక వర్గాలలో "అన్నదాత సుఖీభవ" 3వ విడత మరియు "పి.ఎం. కిసాన్" 22వ విడత నిధుల విడుదల కార్యక్రమాలను నిర్వహించారు. "అన్నదాత సుఖీభవ" 3వ విడత మరియు "పి.ఎం. కిసాన్" 22వ విడత నిధుల విడుదల కార్యక్రమం లో... ??జమ్మలమడుగు లో -- గౌ.ప్రభుత్వ విప్ మరియు శాసన సభ్యులు సి. ఆదినారాయణ రెడ్డి గారు పాల్గొన్నారు. కమలాపురం నియోజక వర్గంలో శాసన సభ్యులు గౌ. పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి గారు...జిల్లా వ్యవసాయ అధికారి ఎం.సుబ్రహ్మణ్యేశ్వర రావు హాజరయ్యారు. ప్రొద్దుటూరు లో -- గౌ. ఎమ్మెల్యే ఎన్. వరదరాజుల రెడ్డి గారు పాల్గొన్నారు. ద్వేల్ -- గౌ మాజీ ఎమ్మెల్యే శ్రీమతి బి. విజయమ్మ గారు పాల్గొన్నారు. పులివెందుల -- టీడీపీ ఇన్‌చార్జ్ ఎం. రవీంద్రనాథ్ రెడ్డి గారు పాల్గొన్నారు. కడప ౽ మైదుకూరు -- వ్యవసాయ శాఖ అధికారులు మరియు శాస్త్రవేత్తలు పాలగొన్నారు

# ఏపీ హై కోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ లీసా గిల్ బాధ్యతల స్వీకరణ



అమరావతి, మహి న్యూస్, మార్చి 13 : ఏపీ హై కోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ లీసా గిల్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఏపీ హై కోర్టు మొదటి కోర్టు హాల్ లో న్యాయమూర్తిగా జస్టిస్ లీసా గిల్ చేత హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్ సింగ్ ఠాకూర్ ప్రమాణ స్వీకారం చేయించారు. జస్టిస్ లీసా గిల్ పంజాబ్, హర్యానా హై కోర్టు న్యాయమూర్తిగా పనిచేస్తూ ఏపీ హై కోర్టుకు బదిలీపై వచ్చారు. ఏపీ హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్ సింగ్ ఠాకూర్ ఏప్రియల్ నెలలో పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో అనంతరం ఏపీ హై కోర్టుకు మొదటి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ లీసా గిల్ వ్యవహరించనున్నారు. జస్టిస్ లీసా గిల్ స్వస్థలం చండిగఢ్ కాగా పంజాబ్ యూనివర్సిటీ నుండి ఎల్ఎల్బీ, ఎల్ ఎల్ ఎం పూర్తి చేశారు. 1990లో న్యాయవాదిగా పంజాబ్ హర్యానా హై కోర్టు లో ప్రాక్టీస్ ప్రారంభించారు. 2014 మార్చి 31న పంజాబ్ హర్యానా హై కోర్టు న్యాయమూర్తిగా నియామకం అయ్యారు. ఈ కార్యక్రమంలో హై కోర్టు న్యాయమూర్తులు, అడిషినల్ సొలిసిటర్ జనరల్ చల్లా ధనుంజయ్, అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, అడ్వకేట్స్ అసోసియేషన్ వైస్ ప్రసిడెంట్ కేవీ రఘు కుమార్, బార్ కౌన్సిల్ ఛైర్మన్ ద్వారకానాథ్ రెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ లక్ష్మీ నారాయణ, సీనియర్ న్యాయవాదులు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

# 14న ఇఫ్తార్ విందు

గుంటూరు, మహి న్యూస్, మార్చి 13 : రంజాన్ సందర్భంగా ఇఫ్తార్ విందును ఈ నెల 14వ తేదీన నిర్వహిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి జె.పార్థసారథి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 14వ తేదీ సాయంత్రం 5 గంటలకు పొన్నూరు రోడ్ లో గల బి - కన్వెన్షన్ లో ప్రారంభం అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరు అవుతారని చెప్పారు. ముస్లిం పెద్దలు, భక్తులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.

# ఘనంగా కవయిత్రి మొల్ల జయంతి



గుంటూరు, మహి న్యూస్, మార్చి 13 : కవయిత్రి మొల్ల అసమాన ప్రజ్ఞావంతురాలని, ఆమె రచించిన రామాయణం నిత్యనూతనమని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ అన్నారు. కవయిత్రి మొల్లమాంబ జయంతి వేడుకలు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా మొల్ల చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళర్పించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ మొల్లమాంబ తెలుగు సాహిత్యానికి చేసిన సేవలను, ఆమె జీవిత చరిత్రను వివరించారు. అచ్చ తెలుగు పదాలతో గద్యరూపంలో సామాన్య ప్రజలకు అర్థం అయ్యేటట్టు ఆమె రామాయణాన్ని రచించారని చెప్పారు. ఆమె గొప్పదనాన్ని గుర్తించిన ఆనాటి రాజులు మొల్లమాంబకు కవిరత్న బిరుదును ఇచ్చి సత్కరించారని, ఆమె పాండిత్యం, అసమాన ప్రజ్ఞ నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలి, వేములకొండ శ్రీనివాస్, చింతనగుండ వాసు, జె. నాగేశ్వర రావు, యు. వెంకటేశ్వర్లు, రాజవరపు సురేష్ బాబు, మొగిలిచర్ల నాగబాబు, యనగంధల శ్రీరాములు, వరికల్లు నాగమల్లేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ పరీక్షలను తనిఖీ చేసిన కలెక్టర్



గుంటూరు, మహి న్యూస్, మార్చి 13 : రెండవ సంవత్సరం ఇంటర్మీడియట్ పరీక్షలను జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా శుక్రవారం గుంటూరు పట్టణంలో గల టి.జె.పి.ఎస్ కళాశాలలో తనిఖీ చేశారు. విద్యార్థులు పరీక్షలు రాస్తున్న తీరును గమనించారు. పరీక్షా కేంద్రంలో కనీస అవసరాలైన తాగునీరు, వైద్య శిబిరాలు ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్షల సమయంలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా, విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకొనుటకు బస్ సౌకర్యం తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు, పరీక్షల సమయంలో చుట్టుప్రక్కల జెరాక్స్ మెషిన్ దుకాణాలు మూసివేయడం అంశాలను గురించి వాకబు చేశారు. రెగ్యులర్ ఇంటర్మీడియట్ పరీక్షలు మార్చి 24వ తేదీ వరకు జరుగన్నాయి. ప్రతి రోజు ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు జిల్లాలో 87 కేంద్రాల్లో ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతున్నాయి. కళాశాలలో చేసిన ఏర్పాట్లను పరీక్ష కేంద్రం సూపరింటెండెంట్ వివరించారు.

# 14న జాతీయ లోక్ అదాలత్

గుంటూరు, మహి న్యూస్, మార్చి 13 : జాతీయ లోక్ అదాలత్ ను ఈ నెల 14వ తేదీన నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి మరియు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ బి. సాయి కళ్యాణ్ చక్రవర్తి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 14వ తేదీ ఉదయం 10 గంటల నుండి జిల్లా న్యాయస్థానం ఆవరణలో లోక్ అదాలత్ జరుగుతుందన్నారు. ఈ జాతీయ లోక్ అదాలత్ లో సివిల్, కాంపౌండబుల్ క్రిమినల్ కేసులు, వివాహ సమస్యలు, కోర్టులలో ప్రీ లిటికేషన్ స్థాయిలో ఉన్న కేసులు లోక్ అదాలత్ లో విచారణకు స్వీకరించడం జరుగుతుందని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

# సురక్షితమైన, నమ్మదగిన ఉత్పత్తులు ఉండాలి




గుంటూరు, మహి న్యూస్, మార్చి 13 : సురక్షితమైన, నమ్మదగిన ఉత్పత్తులు ఉండాలని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ అన్నారు. ప్రపంచ వినియోగదారుల దినోత్సవం శుక్రవారం బ్రాడిపేటలో మాస్టర్ మైండ్స్ ఆవరణలో జరిగింది. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సురక్షితమైన ఉత్పత్తులుతో - విశ్వసనీయ వినియోగదారులు ఉంటారన్నారు. వినియోగదారులకు రోజువారీ నిత్యావసర వస్తువుల నుండి అధునాతన డిజిటల్ వస్తువుల వరకు సాంకేతికతతో నడిచే మార్కెట్‌లో అందుబాటులో ఉండుట వలన అవి సురక్షితంగా, నమ్మదగినవిగా ఉన్నాయాని నిర్ధారించుకోవడం చాలా ముఖ్యమని అన్నారు. సురక్షితమైన ఉత్పత్తులు జీవితం, ఆరోగ్యం, ఆస్తి, పర్యావరణాన్ని రక్షిస్తాయని తద్వారా మార్కెట్లు, సంస్థలపై ప్రజలకు నమ్మకాన్ని పెంచుతాయని చెప్పారు. వినియోగదారుల రక్షణ చట్టం 2019, అన్యాయమైన వాణిజ్య పద్ధతులు, తప్పుదారి పట్టించే ప్రకటనలు, లోప భూయిష్ట వస్తువులు, సేవల నుండి వినియోగదారులకు రక్షణ కల్పిస్తుందని, ఈ చట్టం పంపిణీదారులు, విక్రేతలను జవాబుదారీగా పనిచేస్తుశీదని, ఉత్పత్తుల ప్రామాణీకరణ, ధృవీకరణ ముఖ్యమైనదన్నారు. ఐ.ఎస్.ఐ, బి.ఐ.ఎస్ హాల్‌మార్క్, ఆగ్ మార్క్ , ఎఫ్.ఎస్.ఎస్.ఎ.ఐ వంటి గుర్తులు భద్రత, నాణ్యత హామీకి చిహ్నాలుగా పనిచేస్తాయన్నారు. వినియోగదారులు కూడా వస్తువులపై ఉన్న లేబుల్స్ ను, వారంటీలను, గడువు తేదీలను తనిఖీ చేయడం, తప్పుదారి పట్టించే ప్రకటనలను గుర్తించడం వలన సురక్షితం కాని ఉత్పత్తులను కట్టడి చేయగలమని అన్నారు. వినియోగదారుల రక్షణ చట్టం 2019 గురించి ప్రజలలో బాగా అవగాహన కల్పించి, చట్టాన్ని బలోపేతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి పి.కోమలి పద్మ, లీగల్ మెట్రోలాజీ జాయింట్ కంట్రోలర్, వినియోగదారుల ఫోరం సభ్యులు, వినియోగదారుల స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# రక్తదాన శిబిరాన్ని సందర్శించిన కలెక్టర్

# రక్తదానం... ప్రాణదానం..

గుంటూరు, మహి న్యూస్, మార్చి 13 : రక్తదానం... ప్రాణదానం అని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అన్నారు. శుక్రవారం గుంటూరు పట్టణంలో గల టి.జె.పి.ఎస్ కళాశాలలో రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన రక్తదాన శిబిరాన్ని సందర్శించారు. యువత ముందుకు వచ్చి రక్తదానం చేయడం పట్ల అభినందనలు తెలియజేశారు. రక్తదానం ప్రాణదానమని ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి రక్తదానం చేయాలని కోరారు. రక్తదానం చేయడం వలన ప్రసవ సమయంలోను, ప్రమాదకర పరిస్థితుల్లో రక్తం అవసరం ఉన్నవారికి ఎంతో తోడ్పడుతుందని చెప్పారు.

### వేసవి తీవ్రత పట్ల అప్రమత్తంగా ఉండాలి

జిల్లాలో వేసవి తీవ్రత పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. జిల్లాలో 45 డిగ్రీలకు పైబడి ఉష్ణోగ్రతలు నమోదు అయ్యే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ప్రతీ శాఖలో నోడల్ అధికారిని నియమించి పర్యవేక్షణ చేయాలని ఆదేశించామన్నారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు చలివేంద్రియాలు ఏర్పాటు చేయాలని, మండల, జిల్లా కార్యాలయాల్లోనూ చలివేంద్రియాలు ఏర్పాటు చేయాలని ఇప్పటికే నిర్వహించిన సమన్వయ సమావేశంలో అధికారులను ఆదేశించమని తెలిపారు. జనకూడలి ప్రదేశాల్లోనూ, ఇతర అవసరమైన ప్రాంతాల్లో చలివేంద్రియాలు ఏర్పాటు చేయాలని, జిల్లాలో తాగునీటి సమస్య ఏర్పడే గ్రామాలు గుర్తించాలని, అటువంటి గ్రామాల్లో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశమన్నారు. పశువులకు, వీధి కుక్కలకు కూడా తాగునీటిని లభ్యంగా ఉంచాలని సూచించారు. కంట్రోల్ రూమ్ లు అన్ని కార్యాలయాల్లో ఏర్పాటు చేయాలని సూచించినట్లు చెప్పారు.

### వడ దెబ్బపై ప్రజల్లో అవగాహన అవసరం

వడ దెబ్బపై ప్రజల్లో అవగాహన అవసరమని చెప్పారు. వడ దెబ్బకు గురి కాకూడదని అందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించాలని చెప్పారు. ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసర పనులు ఉంటే మినహా ఎవరు బయటకు రావద్దని విజ్ఞప్తి చేశారు. అత్యవసర పనులకు బయటకు వస్తే గొడుగు ఉపయోగించాలని, వదులు దుస్తులు ధరించాలని, తగినంత నీటిని తాగాలని సూచించారు. డీ హైడ్రేషన్ కు గురికాకుండా అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# శుద్ధమయిన నీటికి స్వచ్ఛమయిన సంకల్పం

## కల ప్రజలది సాకారం మంత్రి కింజరాపు అచ్చెన్నది ముఖ్యమంత్రి చంద్రబాబుకు మంత్రి అచ్చెన్నకృతజ్ఞతలు



ప్రజల దాహార్తి తీర్చడమే ప్రథమావధిగా తాను పనిచేస్తున్నానని మంత్రి అచ్చెన్న చెబుతున్నారు. ఈ విషయమై ఇంజినీరింగు అధికారులతో మరియు క్షేత్ర స్థాయి సిబ్బందితో నిరంతరం

నిమ్మాడ, మహి న్యూస్, మార్చి 13: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సంకల్పంలో భాగంగా టెక్కలి, నర్సన్నపేట నియోజకవర్గాల ప్రజల దాహార్తి తీర్చేందుకు జల్ జీవన్ మిషన్ నిధులు మంజూరు కావడం నిజంగానే ఈ ప్రాంత వాసులకు శుభవార్త. 1202 కోట్ల రూపాయలతో రెండు నియోజకవర్గాలకూ శుద్ధమయిన జలం అందించేందుకు సంబంధిత నిధుల విడుదలకు ఇవాళ రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. దీంతో ఎన్నికల నాడు ఇచ్చిన హామీల అమలుకు కట్టుబడి సుదీర్ఘ కాలంగా అపరిష్కృతంగా ఉన్న తాగునీటి సమస్యకు తెరపడింది. ఇందుకు సంబంధించిన పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయి. మొత్తం 497 గ్రామాలకు సంబంధించి గొట్టా బ్యారేజ్ నుంచి తాగునీటిని అందించేందుకు చర్యలు చేపట్టనున్నారు. టెక్కలి నియోజకవర్గ ప్రాంత ప్రజలకు రోజుకు 42 మిలియన్ లీటర్లు అందించడమే లక్ష్యంగా సంబంధిత జల్ జీవన్ మిషన్ అన్నది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంలో భాగంగా పనిచేయనుంది. ఈ పథకంలో భాగంగా 12 బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ల ద్వారా సమస్య పరిష్కారం కానుంది. దీంతో నియోజకవర్గ వాసులు ఆనందం వ్యక్తం చేశారు. వాస్తవానికి గత ప్రభుత్వంలో పూర్తి నిర్లక్ష్యానికి గురైన సంబంధిత జల్ జీవన్ మిషన్ పనులు..ఇప్పుడు మంత్రి అచ్చెన్నాయుడు సుదీర్ఘ కాలంగా చేసిన కృషి ఫలితంగా ఊపందుకోనున్నాయి. ఈ..నేపథ్యంలో ప్రతి గ్రామానికి తాగునీరు అందించడం ముఖ్యంగా వేసవి వేళలలో చర్చించారు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు. ప్రాజెక్టు కొలిక్కి తెచ్చేందుకు క్షేత్ర స్థాయిలో అవరోధాల తొలగింపునకు మంత్రి అచ్చెన్న కృషి సాగించారు. మంత్రి తీసుకున్న చొరవ కారణంగానే కేంద్రం న నుంచి నిధులు రావడం అందుకు రాష్ట్ర క్యాబినెట్ లో ఆమోదం రావడం చకచకా జరిగిపోవడంతో ఇప్పుడిక పనులు ప్రారంభం కావడమే తరువాయి. అందుకు తగ్గ ప్రణాళికలు సైతం మంత్రి అచ్చెన్న సిద్ధం చేశారు. సత్వరం పనులు ప్రారంభించి తక్కువ సమయంలో పనులు పూర్తి చేసి నిర్దేశిత లక్ష్యాలు చేరుకోవాలని మంత్రి అచ్చెన్న ఇప్పటికే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వేసవి రాకమునుపే జల్ జీవన్ మిషన్ పనులు ప్రారంభించి, సత్వరమే వాటిని పూర్తి చేసి తాగునీటి సమస్యను పరిష్కరించాలన్నది మంత్రి అచ్చెన్న యోచన. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఒప్పించి గ్రామాలకు ఎటువంటి తాగునీటి సమస్యా లేకుండా జల్ జీవన్ మిషన్ (కేంద్ర ప్రాయోజిత పథకం) ద్వారా నిధులు తీసుకుని వచ్చి ఎక్కడా ఎటువంటి జాప్యం తలెత్తకుండా పనులు చేయించాలని మంత్రి అచ్చెన్న భావిస్తున్నారు. ఇందులో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా శుద్ధ జలాలు అందించే ప్రక్రియలో భాగంగా.. త్వరలోనే పనులు ప్రారంభం కానున్నాయి. ఎన్నికల వేళ ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ క్షేత్ర స్థాయిలో ప్రతి గ్రామానికీ శుద్ధ జలం అందించాలన్న సంకల్పంతో .. మొత్తం 1202 కోట్ల రూపాయల నిధులతో అటు నర్సన్నపేటకూ, ఇటు టెక్కలికీ నిధులు అందిస్తూ ఏక కాలంలో రెండు నియోజకవర్గాల సమస్యలు పరిష్కరించేందుకు మంత్రి అచ్చెన్న తీసుకున్న చొరవ సత్ఫలితాలు ఇచ్చింది. దీంతో కేవలం మాటలు చెప్పి కాలక్షేపం చేయడం అన్నది తన పని కాదని, సంకల్పంతో పనిచేసి ప్రజల దాహార్తిని తీర్చడమే తన లక్ష్యమని మంత్రి అచ్చెన్న మరోసారి నిరూపించారని నియోజకవర్గం ప్రజలూ, స్థానిక కూటమి నాయకులూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# సీఎం చంద్రబాబు లక్ష్యం...

## అన్ని బీసీ కులాలకు అసెంబ్లీ ప్రాతినిథ్యం

విజయవాడ, మహి న్యూస్, మార్చి 13 : అన్నీ బీసీ కులాలకు అసెంబ్లీలో ప్రాతినిథ్యం కల్పించడమే సీఎం చంద్రబాబు లక్ష్యమని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టంచేశారు. తెలుగు సాహిత్యంలో మొల్లమాంబ రచనలకు ప్రత్యేకమైన స్థానం ఉంది. ఆమె తెలుగు కవయిత్రి కావడం తెలుగు జాతి అదృష్టమన్నారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శుక్రవారం జరిగిన తొలి తెలుగు కవయిత్రి ఆతుకూరి



మొల్లమాంబ రాష్ట్ర స్థాయి జయంత్యోత్సవంలో మంత్రి కొల్లు రవీంద్రతో పాటు పాల్గొని మంత్రి సవిత ప్రసంగించారు. తెలుగు జాతి గర్వించదగ్గ రచయిత్రి మొల్లమాంబ అని అన్నారు. సంస్కృతంలోని వాల్మీకి రామాయణాన్ని సరళమైన తెలుగు భాషలోకి తొలిసారి రచించిన ఘనత కవయిత్రి మొల్లమాంబదేనన్నారు. మొల్ల తన రచనలలో నైతిక విలువలకు ప్రాధాన్యమిచ్చారన్నారు. నేటి తరం మహిళాలకు, కవయిత్రిలకు మొల్ల ఆదర్శనీయమన్నారు. మొల్ల రచనలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

### బీసీలకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం

బీసీలకు సీఎం చంద్రబాబు, కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని మంత్రి సవిత తెలిపారు. శాలివాహన ఫెడరేషన్



ఏర్పాటు చేసిన ఘనత అన్న ఎన్టీఆర్ దేనన్నారు. ఆదరణ 1, ఆదరణ 2 పథకాలను అమలు చేసి, కుమ్మరులకు పనిముట్లను సీఎం చంద్రబాబు అందజేశారన్నారు. త్వరలో రూ.1000 కోట్లతో అమలు చేయనున్న ఆదరణ 3.0లో విద్యుత్ తో నడిచే ఆధునిక పనిముట్లు అందజేయనున్నామన్నారు. బీసీల్లో ఉన్న కులాలన్నింటికీ అసెంబ్లీలో ప్రాతినిథ్యం కల్పించాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. ఎంఎస్ఎంఈ పార్కుల్లో బీసీలకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. త్వరలో డీఎస్సీ నోటిఫికేషన్ రాబోతోందని, బీసీ అభ్యర్థులకు మరోసారి ఉచితంగా బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా ఉచిత శిక్షణ ఇవ్వబోతున్నామన్నారు. గతేడాది నిర్వహించిన మెగా డీఎస్సీకి బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా ఉచిత డీఎస్సీ కోచింగ్ అందజేసిన విషయాన్ని మంత్రి సవిత గుర్తు చేశారు. రాష్ట్ర కుమ్మరి/శాలివాహన అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పేరేపి ఈశ్వర్ తెలిపిన సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు.

### మొల్ల స్ఫూర్తి ప్రధాత : మంత్రి కొల్లు రవీంద్ర

వాల్మీకి రామాయణాన్ని తెలుగలోకి రచించిన మొల్లమాంబ అందరికీ స్ఫూర్తి ప్రధాన అని మంత్రి కొల్లు రవీంద్ర కొనియాడారు. ఆయా కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేయడం ద్వారా వారి సమస్యలకు పరిష్కారం లభిస్తుందని సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ఆలోచని అని అన్నారు. కేవలం కార్పొరేషన్లకు పాలక మండళ్లు ఏర్పాటు చేయడమే కాకుండా వాటికి నిధులు సైతం కేటాయిస్తున్నారన్నారు. నూతన బడ్జెట్ లో బీసీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం రూ.50 వేల కోట్లు కేటాయించిందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను బీసీ సామాజిక వర్గీయులు వినియోగించుకుని, అభివృద్ధి పథంలో పయనించాలని మంత్రి కొల్లు రవీంద్ర ఆకాంక్షించారు. అంతకుముందు తుమ్మలపల్లి కళా క్షేత్రం ఆవరణలో మొల్ల విగ్రహానికి మంత్రులు సవిత, కొల్లు రవీంద్ర పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం జ్యోతి ప్రజల్వన చేసి మంత్రులు మొల్లమాంబ రాష్ట్ర స్థాయి జయంత్యోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రులు సవితను, కొల్లు రవీంద్రను కుమ్మరి/శాలివాహన వర్గీయులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కుమ్మరి/శాలివాహన అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పేరేపి ఈశ్వర్, పాలకమండలి డైరెక్టర్లు, బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్ మల్లికార్జున, కుమ్మరి/శాలివాహన సామాజిక వర్గీ యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# తహసిల్దార్, ఆర్ఐ ఇద్దరు వీఆర్వోలు సస్పెన్షన్

గుంటూరు, మహి న్యూస్, మార్చి 13 : తాడికొండ తహసిల్దార్, ఆర్ఐ ఇద్దరు వీఆర్వోలు సస్పెన్షన్ చేస్తూ జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఉత్తర్వులు జారీ చేశారు. భూమి మ్యుటేషన్ వ్యవహారంలో నిబంధనలకు విరుద్ధంగా, లోపబోయిష్టంగా చేపట్టడం పట్ల విచారణ చేపట్టి తహసిల్దార్, రెవిన్యూ ఇన్స్పెక్టర్ తో సహా ఇద్దరు వీఆర్వోలను సస్పెన్షన్ చేశారు. ఇటువంటి తప్పులు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఈ సంఘటనతో హెచ్చరించారు. ఇందులో భాగంగా తహసిల్దార్ పి. మెహర్ కుమార్, రెవిన్యూ ఇన్స్పెక్టర్ ఎన్.హనుమంతరావు, తాడికొండ - 3 స్వర్ణ గ్రామం గ్రామ రెవెన్యూ అధికారి టి.బ్రహ్మయ్య, తాడికొండ - 4 స్వర్ణ గ్రామం గ్రామ రెవెన్యూ అధికారి జి.రాంబాబులను సస్పెన్షన్ చేశారు.

# జాబ్ కార్డుదారులు ఉపాధి హామీ పథకాన్ని వినియోగించుకోవాలి



గుంటూరు, మహి న్యూస్, మార్చి 13 : ఉపాధి హామీ జాబ్ కార్డుదారులు ఉపాధి హామీ పథకాన్ని విరివిగా వినియోగించుకోవాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వి.శంకర్ అన్నారు. జిల్లాలో వ్యవసాయ పనులు దాదాపు ముగిసాయనీ ఉపాధి హామీ పనులపై దృష్టి సారించాలని కోరారు. శుక్రవారం గుంటూరులో గుంటూరు క్లస్టర్ ఉపాధి హామీ సిబ్బందితో జగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాబోయే పంట సీజన్ నాటికి గ్రామాలలో ఫీల్డ్, ఫీడర్ చానెల్ పూడిక తీత పనులను చేపట్టి కాలువలని సిద్ధం చేయాలన్నారు. మరొక 17 రోజులలో ఈ ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున ఈ సంవత్సరానికి జిల్లాకు కేటాయించిన 21 లక్షల పని దినాల లక్ష్యాన్ని పూర్తి చేయడానికి ఉపాధి శ్రామికులకు గ్రామాలలో పనులు జరుగుతున్నాయన్న సమాచారాన్ని చెరవేసి వారు పనులకు హాజరైయ్యేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. వేసవిలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయన్న ముందస్తు సమాచారం ఉన్నందున పని ప్రదేశాలలో మంచినీరు, మజ్జిగ ఏర్పాటు చేయడం వంటి మౌలిక అవసరాలు కల్పించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ పథక సంచాలకులు బి. శ్యామలా దేవి, గుంటూరు క్లస్టర్ మరియు ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

## విశాఖపట్నం తపాలా విభాగం ఆధ్వర్యంలో

# 121వ తపాలా ఆదాలత్

శ్రీకాకుళం, మహి న్యూస్, మార్చి 13 : విశాఖపట్నం తపాలా విభాగం పరిధిలోని వినియోగదారుల సమస్యల పరిష్కారార్థం 121వ తపాలా ఆదాలత్తు ఈ నెల 20-03-2026 (శుక్రవారం) ఉదయం 11.00 గంటలకు విశాఖపట్నం, ఎం.వి.పి కాలనీ హెడ్ పోస్ట్ ఆఫీస్ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు తపాలా శాఖ సహాయ సంచాలకులు కె. వి. డి. సాగర్, ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఆదాలత్‌లో తపాలా సేవలకు సంబంధించిన ఫిర్యాదులు, మనీ ఆర్డర్లు, పార్సిల్స్, సేవింగ్స్ బ్యాంక్, ఆర్.డి, పి.ఎల్.ఐ తదితర సేవలపై వినియోగదారులు తమ సమస్యలను లిఖిత పూర్వకంగా సమర్పించవచునని ఫిర్యాదులను తేదీ.16-03-2026 లోపు అసిస్టెంట్ డైరెక్టర్-××, కార్యాలయం పోస్టుమాస్టర్ జనరల్, విశాఖపట్నం ప్రాంతం, విశాఖపట్నం -- 530017 అను చిరునామాకు పంపవలసిందిగా సూచించారు. సమస్యలపై త్వరితగతిన పరిష్కారం కోసం వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని ఆయన కోరారు.

# విలువలతో ఎదిగిన వ్యక్తి హెచ్.జె దొర

## కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు

శ్రీకాకుళం, మహి న్యూస్, మార్చి 13 : శ్రీకాకుళం జిల్లాలోని మారుమూల ప్రాంతం జర్జంగి లో పుట్టి.. పోలీసు శాఖలో పతాక స్థాయికి ఎదిగిన హెచ్.జె దొర మరణం.. దేశానికే తీరని లోటని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు విచారం వ్యక్తం చేశారు. సంచలన పోలీసు అధికారిగా పేరు తెచ్చుకున్న ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ మాజీ డిజిపి హెచ్.జె దొర మరణ వార్త వినగానే తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యానని అన్నారు. తన తండ్రి దివంగత ఎర్రన్నాయుడు తో కూడా దొర మంచి అనుబంధంతో ఉండేవారని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. 1965 బ్యాచ్ ఐపిఎస్ అధికారి అయిన హెచ్.జె దొర.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ డిజిపిగా, సి.ఐ.ఎస్.ఎఫ్ డైరక్టర్ జనరల్ గా, ఎపిఎస్ ఆర్టిసి ఎం.డి గా, ఇంటలిజెన్స్ అధికారిగా, హైదరాబాద్ పోలీస్ కమీషనర్ గా ఇలా పలు హోదాలలో పనిచేసి మెరుగైన పనితీరు కనబరిచారని అన్నారు. పదవి విరమణ అనంతరం 2006లో జీఎమ్మార్ సంస్థలో డిల్లీ ఎయిర్పోర్ట్ సెక్యూరిటి అడ్వైజరీ బోర్డ్ చైర్మన్ గా పని చేసి విశ్రాంత సమయంలో కూడా అవిశ్రాంతంగా సేవలందించారని గుర్తు చేశారు. మారుమూల ప్రాంతంలో పుట్టి.. పోలీసు శాఖలో పతాక స్థాయికి దొరగారు ఎదిగిన తీరు ఎప్పుడూ స్ఫూర్తిని అందిస్తుందనీ అన్నారు. పోలీసు శాఖలో అయన చేపట్టిన సంస్కరణలు నేడు కీలకంగా మారాయని అన్నారు. వారి మరణం దేశానికే తీరని లోటని తెలిపిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు.. హెచ్.జె దొర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తు.. వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

RNI : APTEL/25/A0108
మహి న్యూస్
www.mahinewsindia.com
epaper: https://epaper.mahinewsindia.com
తెలుగు దినపత్రిక



# ఎస్ ఎఫ్ ఐ ఆధ్వర్యంలో కోవొత్తులతో నివాళులు




నంద్యాల జిల్లా/ఆళ్లగడ్డ మహి న్యూస్ మార్చి 13: ఇరాన్ పై ఇజ్రాయిల్ అమెరికా దాడిని ఖండిస్తూ, పాఠశాల జరుగుతుండగా 160 మంది బాలికలు ఇజ్రాయిల్ అమెరికా దాడిలో మరణించిన వారికి నివాళిగా, యుద్ధం ఆపాలని నినదిస్తూ ఆళ్లగడ్డ మండల కమిటీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళులు




నిర్వహించారని ఎఫ్ఎస్ఐ మండల కార్యదర్శి లతీఫ్ తెలిపారు ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ యుద్ధం వద్దు ప్రపంచం శాంతి కావాలని, మానవ మనుగడ అభివృద్ధి కావాలని వారన్నారు,యుద్ధలా వల్లన ఆర్థిక సంక్షభం, ప్రాణ నష్టాలు తప్పా ప్రజా సంక్షేమం ఉండదని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో నాయుకులు తదితరులు పాల్గొన్నారు

# కవయిత్రి మొల్లమాంబ జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలి

## రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఘనంగా మొల్లమాంబ జయంతి వేడుకలు



### జిల్లా రెవెన్యూ అధికారి డి.రాము నాయక్

నంద్యాల, మహి న్యూస్, మార్చి, 13 :- కవయిత్రి మొల్లమాంబ జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకుని స్ఫూర్తి పొందాలని జిల్లా రెవెన్యూ అధికారి డి.రాము నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కవయిత్రి మొల్ల జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా బిసి సంక్షేమ అధికారి జగ్గయ్య వివిధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి డి.రాము నాయక్ మాట్లాడుతూ రామాయణాన్ని అతి సులువైన పదాలతో తెలుగులో రాసి తన సరళమైన పదజాలాన్ని అందరూ మెచ్చేలా రచించిన కవయిత్రి మొల్ల అని కొనియాడారు. ఆమె రాసిన రామాయణం 'మొల్ల రామాయణం'గా ఎంతో ప్రసిద్ధి చెందిందన్నారు. రామాయణాన్ని తెలుగులో రాసిన తొలి కవయిత్రిగా కూడా ఆమె ఎంతో పేరు ప్రఖ్యాతలు గాంచిందన్నారు. అందుకే ప్రభుత్వం ఇప్పుడు మొల్ల జయంతిని రాష్ట్ర ఉత్సవంగా నిర్వహించేలా అధికారిక ఉత్తర్వులు విడుదల చేయడం జరిగిందన్నారు. మొల్ల అసలు పేరు ఆతుకూరి మొల్లమాంబ. ఆమె 16వ శతాబ్దపు తెలుగు కవయిత్రి. తెలుగులో తాను రాసిన రామాయణం మొల్ల రామాయణంగా ప్రసిద్ధి చెందింది. ఈమె కుమ్మరి కుటుంబంలో జన్మించింది. మొల్ల శ్రీ కృష్ణదేవరాయల సమయంలోనిదని కూడా ప్రసిద్ధి. ఇక మొల్ల రచనలను చదివినవారు మొల్ల రచనా శైలి చాలా సరళమైందని, రమణీయంగా ఉంటాయన్నారు. మొల్ల రామాయణం మొత్తం ఆరు కాండాలలో 871 పద్యాలతో కూడుకుందని, ఈ కావ్యాన్ని మొల్ల కేవలం ఐదు రోజులలో వ్రాయడం జరిగిందన్నారు. మొల్ల రచన ఆనాటి పద్ధతికి విరుద్ధంగా వాడుక భాషకు దగ్గరగా ఉండేదన్నారు.

# ఎల్పీజీ గ్యాస్ ధరల పెంపు

## వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

### జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్



నంద్యాల, మహి న్యూస్, మార్చి 13:- నంద్యాల జిల్లాలోని గ్యాస్ వినియోగదారులకు తెలియజేయడమేమనగా, ఆయిల్ కంపెనీల నుండి అందిన సమాచారం మేరకు డొమెస్టిక్ ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ ధరపై అదనంగా రూ.60/- మరియు కమర్షియల్ ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ ధరపై అదనంగా రూ.115/- పెంపు జరిగినట్లు తెలియజేయబడిందని జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం జిల్లాలోని ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్ల వద్ద తగినంత గ్యాస్ నిల్వలు ఉన్నందున గ్యాస్ వినియోగదారులు ఎటువంటి ఆందోళనకు గురికావలసిన అవసరం లేదని తెలిపారు. అవసరానికి మించిన అదనపు బుకింగ్స్ చేయకుండా వినియోగదారులు సహకరించాలని కోరారు. అలాగే, గృహ వినియోగం కోసం కేటాయించిన డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను హోటల్స్, టిఫిన్ సెంటర్లు లేదా ఇతర వాణిజ్య అవసరాలకు విక్రయించినట్లు తెలిసిన పక్షంలో, సంబంధిత వినియోగదారుల గ్యాస్ సబ్సిడీ నిలిపివేయడమే కాకుండా వారి గ్యాస్ కనెక్షన్ రద్దు చేయుటకు తగిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. ఇక ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్లు కూడా ఎట్టి పరిస్థితుల్లోనూ డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు మళ్లించకుండా కట్టుదిట్టమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ విషయంలో నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే సంబంధిత డిస్ట్రిబ్యూటర్లపై కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా వారి లైసెన్సులు కూడా రద్దు చేయబడతాయని తెలిపారు. అదేవిధంగా, గ్యాస్ డెలివరీ సమయంలో వినియోగదారులు బిల్లులో పేర్కొన్న మొత్తానికి మించి డెలివరీ బాయ్స్‌కు ఎటువంటి అదనపు చెల్లింపులు చేయవలసిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఎవరైనా డెలివరీ సిబ్బంది వినియోగదారులతో అమర్యాదగా ప్రవర్తించినా లేదా బిల్లులో ఉన్న మొత్తానికి మించి డబ్బులు డిమాండ్ చేసినా వెంటనే సంబంధిత పౌర సరఫరాల శాఖ డిప్యూటీ తహశీల్దారు, మండల తహశీల్దారు, జిల్లా పౌరసరఫరాల అధికారి లేదా టోల్ ఫ్రీ నెంబర్ 1967 కు ఫిర్యాదు చేయవలసిందిగా జాయింట్ కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

# సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేస్తే కఠిన చర్యలు



### కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు ప్రతినిధి మహిన్యూస్ మార్చి13: ప్రముఖుల పై సోషల్ మీడియా వేదికల్లో అనుచిత వ్యాఖ్యలు, అసత్య ప్రచారాలు, వ్యక్తుల గౌరవానికి భంగం కలిగించే పోస్టులు చేయడం చట్ట విరుద్ధమని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.సమాజంలో శాంతి భద్రతలకు భంగం కలిగించే విధంగా సోషల్ మీడియాను దుర్వినియోగం చేసే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఫేస్‌బుక్, వాట్సాప్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో తప్పుడు వార్తలు, ద్వేషపూరిత వ్యాఖ్యలు లేదా అసభ్యకర పోస్టులు చేసినట్లయితే గుర్తించి సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేస్తామని కర్నూలు ఎస్పీ హెచ్చరించారు. జిల్లా ఎస్పీ పలు సూచనలు చేశారు.సోషల్ మీడియా లో ఎటువంటి సమాచారం అయినా నిజానిజాలు తెలుసుకున్న తర్వాత మాత్రమే షేర్ చేయాలి.అసత్య ప్రచారాలు , ద్వేషపూరిత వ్యాఖ్యలు చేయడం చట్టపరంగా శిక్షార్హం. ఇతరుల వ్యక్తిగత గౌరవాన్ని దెబ్బతీసే పోస్టులు, కామెంట్లు చేయకూడదు.సామాజిక విభేదాలు, మత విద్వేషాలు రెచ్చగొట్టే పోస్టులను ఎట్టి పరిస్థితుల్లోనూ షేర్ చేయకూడదు.అనుమానాస్పద లేదా అనుచిత పోస్టులు గమనించిన వెంటనే పోలీసులకు లేదా సైబర్ క్రైమ్ విభాగానికి సమాచారం ఇవ్వాలి. సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా ఉపయోగించి సమాజంలో శాంతి భద్రతలను కాపాడటంలో ప్రతి ఒక్కరూ సహకరించాలని కర్నూల్ ఎస్పీ విక్రాంత్ పాటిల్ కోరారు.

# తొలి తెలుగు కవయిత్రి మొల్ల జయంతి వేడుకలు



కర్నూలు ప్రతినిధి మహిన్యూస్ మార్చి 13: తెలుగు సాహిత్యానికి విశిష్టమైన సేవలు అందించి , రామాయణాన్ని తెలుగు భాషలోనికి అనువదించిన తొలి తెలుగు కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ జయంతి వేడుకలను పురస్కరించుకొని జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు హుస్సేన్ పీరా, కృష్ణమోహన్ లు కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.మొల్ల జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించిన నేపథ్యంలో జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు ఈ వేడుకలను నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు ఎస్పీ లు మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో మొల్ల కవిత్వం ప్రత్యేక స్థానం సంపాదించిందని, ఆమె రచనలు తెలుగు భాషకు అమూల్యమైన సంపదగా నిలిచాయన్నారు.ఆమె రచనలు అనాటి మహిళల్లో చైతన్యం, జాగృతి కలిగించడంలో కీలక పాత్ర పోషించాయన్నారు.ప్రతి ఒక్కరూ సాహిత్యంపై ఆసక్తి పెంపొందించుకుని గొప్ప వ్యక్తుల ఆదర్శాలను అనుసరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్ ఐ జావేద్, ఎఆర్ ఎస్సైలు, ఎఆర్ పోలీసు అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.



# పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు రాయనున్న విద్యార్థులకు జిల్లా కలెక్టర్ శుభాకాంక్షలు

నంద్యాల, మహి న్యూస్, మార్చి 13:- మార్చి నెలలో నిర్వహించనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరుకానున్న జిల్లాలోని సుమారు 25,035 మంది విద్యార్థులకు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి శుభాకాంక్షలు తెలిపారు. విద్య మనిషిని ఎక్కడైనా గౌరవనీయుడిగా నిలబెడుతుందని పేర్కొంటూ, పదవ తరగతి పరీక్షలు విద్యార్థుల భవిష్యత్తుకు తొలి మెట్టు అని ఆమె అన్నారు.

### సమయపాలనకు ప్రాధాన్యత ఇవ్వాలి

పరీక్షల ముందు మరియు పరీక్షల మధ్య ఉన్న సమయాన్ని సమర్థవంతంగా వినియోగించుకుని పాఠాలను పునశ్చరణ చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. సమయపాలనతో చదువుకు ప్రణాళిక రూపొందించుకుంటే మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు.

### ఆత్మవిశ్వాసమే విజయానికి మూలం

విద్యార్థులు తమపై నమ్మకం ఉంచుకుని ధైర్యంగా పరీక్షలను ఎదుర్కోవాలని కలెక్టర్ అన్నారు. చిన్న చిన్న సమస్యలు ఎదురైనా దిగులు పడకుండా పట్టుదలతో ముందుకు సాగితే విజయం సాధించగలరని సూచించారు.

### చక్కటి చేతిరాతతో సమాధానాలు రాయాలి

పరీక్షల సమయంలో ప్రశ్నలను పూర్తిగా అర్థం చేసుకుని స్పష్టంగా, చక్కటి చేతిరాతతో సమాధానాలు రాయాలని ఆమె సూచించారు. ఇలా రాయడం ద్వారా మూల్యాంకనం చేసే వారికి సమాధానాలు సులభంగా అర్థమై మంచి మార్కులు పొందే అవకాశం ఉంటుందని తెలిపారు.

### ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి

పరీక్షల సమయంలో విద్యార్థులు ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు పౌష్టికాహారం తీసుకోవడం, తగినంత నిద్ర తీసుకోవడం ఎంతో అవసరమని కలెక్టర్ పేర్కొన్నారు. ఆరోగ్యంగా ఉంటే పరీక్షలను మరింత సమర్థవంతంగా రాయగలరని తెలిపారు.

### జిల్లాకు మంచి పేరు తీసుకురావాలి

జిల్లాలోని విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి తమ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు ఆనందాన్ని కలిగించడంతో పాటు నంద్యాల జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా ఆకాంక్షించారు. విద్యార్థులందరికీ విజయాన్ని



కోరుతూ ఆమె శుభాకాంక్షలు తెలిపారు.

# రామాయణాన్ని తెలుగు భాషలోనికి అనువదించిన తొలి తెలుగు కవయిత్రి మొల్లమాంబ

### జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్

కర్నూలు, మహి న్యూస్, మార్చి 13:- సంస్కృత రామాయణాన్ని తెలుగు భాషలోనికి అనువదించిన తొలి తెలుగు కవయిత్రి మొల్లమాంబ అని జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తొలి తెలుగు కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ జయంతిని పురస్కరించుకొని వారి చిత్ర పటానికి పూలమాల వేసి జాయింట్ కలెక్టర్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ వాల్మీకి రచించిన రామాయణాన్ని సంస్కృతం నుండి సరళంగా అందరికీ అర్థమయ్యే రీతిలో తెలుగు భాషలోనికి రచించిన కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబను స్మరించుకోవడం సంతోషించదగిన విషయమన్నారు..ఈరోజు మనం 1414లో జన్మించిన మొల్లమాంబ గారి జయంతి వేడుకలు జరుపుకుంటున్నాం అన్నారు. ఆ కాలంలోనే ఆమె సంస్కృతాన్ని అభ్యసించారన్నారు. అది చాలా కష్టమైన భాష అయినప్పటికీ, అటువంటి సమయంలోనే ఆమె సంస్కృతం నుండి తెలుగులోకి రామాయణాన్ని అనువదించారన్నారు. ప్రస్తుతం మన జిల్లాలో మహిళా అక్షరాస్యత రేటు కేవలం 35% - 36% మాత్రమే ఉందన్నారు. కానీ 650 ఏళ్ల క్రితమే ఆమె అంత బాగా చదువుకుని రామాయణాన్ని అనువదించారన్నారు. ఆమె ధర్మం, భక్తి, నీతి వంటి అంశాలపై దృష్టి సారించారన్నారు. ఒక కవిగానే కాకుండా, ఆ కాలంలోని సామాజిక సమస్యల పైన కూడా ఆమె ఎంతో రాశారన్నారు. మహిళ మరియు పురుషులు ఇద్దరికీ అన్ని రంగాల్లో రాజకీయ, సామాజిక, విద్యా లేదా ఉద్యోగ రంగాలైనా--- సమానమైన హక్కులు ఉండాలన్నారు. అప్పటి నుండి ఇప్పటి వరకు చాలా పురోగతి ఉందని, ఇంకా చాలా సాధించాల్సి ఉందన్నారు. గతంలో మన జిల్లాలో మహిళా అక్షరాస్యత రేటు కేవలం 35%- 36% మాత్రమే ఉండేది, కానీ ఇప్పుడు 6వ తరగతి వరకు చూస్తే అబ్బాయిలు మరియు అమ్మాయిల సంఖ్య దాదాపు సమానంగా ఉందన్నారు. అయితే, 10వ తరగతికి వచ్చేసరికి ఈ సంఖ్య మళ్ళీ తగ్గిపోతుందన్నారు. 10వ తరగతిలో దాదాపు 60 మంది అబ్బాయిలు ఉంటే, కేవలం 40 మంది అమ్మాయిలే కనిపిస్తున్నారన్నారు. పై తరగతులకు వెళ్లేకొద్దీ ఈ శాతం ఇంకా తగ్గుతోందన్నారు. కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ గారికి వారి తల్లిదండ్రులు ఇచ్చిన స్వేచ్ఛ మరియు అందించిన మద్దతుకు గాను 650 సంవత్సరాల తర్వాత కూడా మనం ఆమె పేరును గుర్తుంచుకుంటున్నామన్నారు. అలాగే, మీ ఇంట్లో ఉన్న అమ్మాయిలకు మీరు మద్దతు ఇస్తే, ఖచ్చితంగా రాబోయే 50 లేదా 100 సంవత్సరాలలో మీ కూతురి పేరును లోకం గుర్తుంచుకుంటుందన్నారు. ఇక్కడ హాజరైన చాలా మంది నాయకులు మొల్లమాంబ విగ్రహం ఏర్పాటు చేయాలని కోరుతున్నారని, సంబంధిత అంశం గురించి ఖచ్చితంగా పరిశీలించి, కలెక్టర్ గారి దృష్టికి తీసుకొని వెళ్తామన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి ప్రసూన, బీసీ కార్పొరేషన్ ఈడీ జాకీర్ హుస్సేన్, ఉప్పరి కార్పొరేషన్ డైరెక్టర్ రామ గిడ్డయ్య, కుమ్మర/శాలివాహన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు పుల్లయ్య, జిల్లా అధ్యక్షులు నాగన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, కోశాధికారి వెంకటేశ్వర్లు, కుమ్మర/శాలివాహన సంఘం నాయకులు ఇతర కుల సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గృహ అవసరాల (డొమెస్టిక్)గ్యాస్ వినియోగదారులు గ్యాస్ కొరత గురించి ఎటువంటి అపోహలు వద్దు

### జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్

కర్నూలు, మహి న్యూస్, మార్చి 13:- గృహ అవసరాల (డొమెస్టిక్) గ్యాస్ వినియోగదారులు గ్యాస్ కొరత గురించి ఎటువంటి అపోహలు పెట్టుకోవద్దని జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్ లో డిస్ట్రిక్ట్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ కౌన్సిల్ కమిటీ సమావేశాన్ని జాయింట్ కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ డొమెస్టిక్ గ్యాస్ వినియోగదారులకు గ్యాస్ కొరత గురించి భయపడాల్సిన అవసరం లేదన్నారు. సరిపడా స్టాక్ అందుబాటులో ఉందన్నారు. ప్లాంట్లలో సాధారణంగా 3 నుండి 6 రోజులకు సరిపడా స్టాక్ నిరంతరం అందుబాటులో ఉంటుందన్నారు. భారత ప్రభుత్వం వాణిజ్య సంస్థలకు (జశీఎవవతీఎఖుశ్రీ వర్ఘుఎశ్రీఅంప్తఎవత్ం) సంబంధించి కొన్ని నిబంధనలు మరియు రేషనింగ్ విధానాలను అమలు చేస్తోందనీ, దీనివల్ల గృహ వినియోగదారులకు ఎటువంటి ఇబ్బంది ఉండదన్నారు. ఆసుపత్రులు, హాస్టళ్లు మరియు జైళ్ల వంటి అత్యవసర సేవలకు గ్యాస్ సరఫరా లో ఎలాంటి ఇబ్బందులు ఉండకూడదని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారన్నారు. రాష్ట్రంలో లేదా జిల్లాలో ఎల్‌పీజీ కొరత లేదన్నారు. అనవసరంగా భయపడి స్టాక్ పెంచుకోవద్దని, అలా చేయడం వల్ల కృత్రిమ కొరత ఏర్పడే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం మరియు భవిష్యత్తులో కూడా గ్యాస్ సరఫరా సాధారణంగానే కొనసాగుతుందన్నారు. వినియోగదారుల రక్షణ చట్టం సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. ముఖ్యంగా పౌరులకు, విద్యార్థులకు ఈ చట్టంపై అవగాహన కల్పించాలన్నారు. స్థానిక మార్కెట్‌లలో విక్రయించే వస్తువుల నాణ్యతను పర్యవేక్షించే బాధ్యత జిల్లా యంత్రాంగంపై ఉందన్నారు. ఆహార నాణ్యత విషయంలో ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్, సివిల్ సప్లైస్ డిపార్ట్‌మెంట్ ప్రధాన పాత్ర పోషిస్తాయన్నారు. చిన్న చిన్న ప్యాకెట్లలో దొరికే వస్తువుల నాణ్యతను, హోటళ్లలో లూజ్ గా విక్రయించే ఆహార పదార్థాల విషయంలో తనిఖీలు చేయాలన్నారు. గత ఒక నెలలో ఈ విషయంలో మంచి పురోగతి కనిపించిందని, అయితే తనిఖీలను మరింత ముమ్మరం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కేవలం ప్యాక్ చేసిన ఐటమ్స్ మాత్రమే కాకుండా బిర్యానీ, ఇడ్లీ తదితర వాటిలో వాడే పదార్థాలు మరియు వాటి నాణ్యతను కూడా తనిఖీ చేయాలని జాయింట్ కలెక్టర్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్లను ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. ఇలాంటి చర్యల గురించి వార్తాపత్రికలు మరియు మీడియాలో ప్రచారం జరిగినప్పుడు, మిగిలిన వ్యాపారులలో కూడా మార్పు వస్తుందన్నారు. ఆహార భద్రత విషయంలో ఎలాంటి ఉల్లంఘనలు జరిగినా జిల్లా యంత్రాంగం కఠినంగా వ్యవహరిస్తుందని జాయింట్ కలెక్టర్ స్పష్టం చేశారు. గత వారం రోజులుగా కమర్షియల్ సంస్థలలో గృహ అవసరాలకు ఉపయోగించే న్రా+ సిలిండర్లను ఎక్కువగా వాడుతున్నట్లు గమనించామన్నారు. గత వారంలో దీనిపై చర్యలు తీసుకుని, కమర్షియల్ సంస్థల నుండి దాదాపు 300 సిలిండర్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ తనిఖీలు కొనసాగుతాయన్నారు. ప్రస్తుతం కొన్ని స్కూళ్లలో మాత్రమే కన్స్యూమర్ క్లబ్ లు యాక్టివ్‌గా ఉన్నాయని, అన్ని పాఠశాలల్లో కన్స్యూమర్ క్లబ్ లు యాక్టివ్‌గా ఉండాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై ప్రభుత్వం ఇప్పటికే అనేక ఆదేశాలు జారీ చేసినప్పటికీ, క్షేత్రస్థాయిలో అది అంత ప్రభావవంతంగా అమలు కావడం లేదన్నారు. మున్సిపల్ కమిషనర్లు ఒక క్రమ పద్ధతిలో తనిఖీలు నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. మునిసిపాలిటీలు లేదా పంచాయతీలు నీటిని సరఫరా చేస్తున్నప్పుడు ఖచ్చితంగా నాణ్యత ప్రమాణాలను పాటించాలన్నారు. ఆర్.డబ్ల్యు.ఎస్ విభాగం అన్ని ప్రభుత్వ రెసిడెన్షియల్ హాస్టళ్లలోని నీటి సరఫరా వ్యవస్థలను తప్పనిసరిగా తనిఖీ చేయాలన్నారు. ముఖ్యంగా వేసవి మరియు వర్షాకాలంలో నీరు కలుషితమయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుంది కాబట్టి, ఆ సమయాల్లో తనిఖీలు మరింత తరచుగా జరగాలన్నారు. మున్సిపల్ కార్పొరేషన్లు మరియు మున్సిపాలిటీలు కేంద్రీకృత నీటి శుద్ధి ప్లాంట్లపై ప్రత్యేక దృష్టి సారించి, పట్టణ ప్రజలందరికీ స్వచ్ఛమైన నీరు అందేలా చూడాలన్నారు. మెట్రాలజీ విభాగం వారు పెట్రోలియం ఉత్పత్తుల నాణ్యతను నిరంతరం తనిఖీ చేయాలన్నారు. కిరాణా దుకాణాల్లో అమ్మే వస్తువుల తూనికలను మున్సిపల్ అధికారులతో కలిసి ఉమ్మడిగా తనిఖీ చేయాలన్నారు. వ్యాపారులకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఆకస్మిక దాడులు నిర్వహించాలని, అప్పుడే నిజమైన ఫలితాలు వస్తాయన్నారు. ముఖ్యంగా ప్లాస్టిక్ నిషేధంపై మరియు తూనికలపై ఒకే రోజున తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. రైతు బజార్లు మరియు మార్కెట్ యార్డుల వంటి రద్దీ ప్రాంతాల్లో వినియోగదారుల ప్రయోజనాల దృష్ట్యా తరచుగా తనిఖీలు నిర్వహించాలన్నారు. సమావేశంలో ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఈ మనోహర్, ఆర్టీవో భరత్ చవాన్, డి ఎస్ ఓ రఘువీర్, ఏపీఎస్ఆర్టీసీ ఆర్ఎం శ్రీనివాసులు, ఏపీఎస్పీడీసీఎల్ డిప్యూటీ ఈఈ భాస్కర్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ రాముడు, కర్నూల్ మున్సిపాలిటీ డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, కర్నూలు జిల్లా కన్స్యూమర్ ప్రొటెక్షన్ కౌన్సిల్ డిస్ట్రిక్ట్ సెక్రటరీ శివ మోహన్ రెడ్డి, డిస్టిక్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ మెహబూబ్ ఖాన్, ఆదోని డివిజన్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ప్రెసిడెంట్ ఈసా భాష, తదితరులు పాల్గొన్నారు.

# విశ్వవిద్యాలయాలు దేవాలయాలు విద్యార్థులకు దిక్సూచి లాంటివి

## లా కోర్సులు మరియు ప్రాధాన్యం ఉన్న కోర్సులు ఏర్పాటుకు కృషి చేస్తాం



కర్నూలు, మహి న్యూస్, మార్చి 13 :- విశ్వవిద్యాలయాలు దేవాలయాలు లాంటివని అవి విద్యార్థులకు దిక్సూచి లాగా పనిచేస్తాయని వాటి పవిత్రతను కాపాడుకొని అభివృద్ధిలోకి సాగాలని ఆంధ్రప్రదేశ్ ఎస్టి కమిషన్ మెంబర్ పి. వెంకటప్ప రాయలసీమ యూనివర్సిటీ రివ్యూ సమావేశంలో పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం రాయలసీమ యూనివర్సిటీ సెమినార్ హాల్లో రాయలసీమ యూనివర్సిటీ మరియు కర్నూలు క్లస్టర్ యూనివర్సిటీ అధికారులతో, ఉద్యోగులు, విద్యార్థులు మరియు ఎస్టీ సంఘాల నాయకుల సమీక్ష సమావేశాన్ని రాష్ట్ర ఎస్టీ కమిషన్ మెంబర్ పి వెంకటప్ప నిర్వహించారు ఈ సందర్భంగా కమిషన్ మెంబర్ మాట్లాడుతూ... విశ్వవిద్యాలయాలు దేవాలయాల లాంటివని అవి విద్యార్థులకు మార్గ నిర్దేశం చేస్తాయని వాటి పవిత్రతను కాపాడుకుంటూ అభివృద్ధిలోకి సాగిపోవాలని సూచించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ల ఆదేశాల మేరకు అన్ని యూనివర్సిటీలలో ఎస్టీ విద్యార్థులకు ఎక్కడ అన్యాయం జరగరాదని వారికి ఎటువంటి సమస్యలు ఉండకుండా చూసుకోవాలని నన్ను మెంబర్గా నియమించారని వారి ఆదేశాల మేరకే సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు.విశ్వవిద్యాలయంలో ఎస్టీ విద్యార్థులకు ఎన్ని అడ్మిషన్లు ఇచ్చారు, ఎన్ని పీహెచ్డీలు,ఎం ఫిల్ లు ప్రధానం చేశారు, ఫీజు రీయింబర్స్మెంట్, హాస్టల్ వసతులు విద్యార్థుల సమస్యలు మొదలగు నవి మరియు పనిచేస్తున్న ఔట్సోర్సింగ్,పర్మనెంట్ ఉద్యోగస్తుల ఎస్టీ వారి గురించి మరియు ఉద్యోగస్తుల సమస్యల పై రాయలసీమ యూనివర్సిటీ మరియు క్లస్టర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భం సందర్భంగా పలువురు ఉద్యోగస్తులు తమకు సరైన జీతభత్యాలు మిగిలిన వారితో సమానంగా ఇవ్వడం లేదని,ఉద్యోగాలను పర్మినెంట్ చేయడం లేదని, కమిషన్ మెంబర్ కు తెలియజేశారు. రాయలసీమ యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ సమాధానమిస్తూ ఉద్యోగస్తులకు ప్రస్తుతం ప్రభుత్వ ఆదేశాల మేరకు మరియు కోర్టులు ఇచ్చిన ఆదేశాల మేరకు జీతభత్యాలు కల్పిస్తున్నామని తెలియజేశారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ విద్యార్థులు అంబేద్కర్ విగ్రహ స్థాపనకు వేసే కమిటీల లో ఎస్సీ ఎస్టీ విద్యార్థులకు లకు స్థానం కల్పించాలని , లైబ్రరీకి అంబేద్కర్ పేరు పెట్టాలని ఎం.ఈడి , బిఈడి కోర్సులు మరియు ప్రాధాన్యం ఉన్న కొత్త కోర్సులు ప్రారంభించి విద్యార్థులకు చదువుకునే అవకాశం కల్పించాలని యూనివర్సిటీలో చేసే పనులు టెండర్లు పిలిచి పారదర్శకంగా జరిపించే చర్యలు తీసుకోవాలని కమిషన్ మెంబర్ పి వెంకటప్ప ను కోరారు దానికి సమ్మతించిన మెంబర్ ఆ విధంగా చేయాలని వైస్ ఛాన్సర్ కు సూచించారు . ఈ సందర్భంగా ఎస్టీ కమిషన్ మెంబర్ ఉద్యోగుల సమస్యలకు సమాధానమిస్తూ ఉద్యోగస్తులకు ఎటువంటి నష్టం జరగకుండా వైస్ ఛాన్సర్ పరిధిలో చేయవలసిన పరిష్కారాలు చేయవలసిందిగా కోరారు. పోస్టులు సృష్టించేదానికి యూనివర్సిటీ ఆస్తులు కాపాడుకునే చర్యలు యూనివర్సిటీకి అవసరమైన నిధులు రాబట్టడానికి రాష్ట్ర గవర్నర్ ద్వారా కృషి చేయడం జరుగుతుందని, న్యాయస్థానాల ఆదేశాలను పాటిస్తూ ఉద్యోగుల అభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా రాయలసీమ యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ ప్రొఫెసర్ వెంకట బసవరావు మాట్లాడుతూ...యూనివర్సిటీలో పనిచేస్తున్న ఉద్యోగస్తుల వివరాలను ప్రస్తుతమున్న కోర్సులను మరియు ఇతర వివరాలను కమిషనర్ మెంబర్ కు తెలియజేశారు. ప్రభుత్వ నిబంధనలు మేరకు ఉద్యోగస్తులకు అన్ని విధాల వేతనాలు ఇస్తున్నామని ఆపైన కోర్టు ఆదేశాల మేరకు వారికి వేతనాలు ఇస్తున్నామని ఎవరి పైన కక్ష సాధింపు చర్యలు తీసుకోవడం లేదని నిబంధన మేరకే పని చేస్తున్నామని కమిషన్ మెంబర్ కు తెలియజేశారు. యూనివర్సిటీలోని పనులన్నీ టెండర్ ప్రక్రియ ద్వారా పారదర్శకంగా చేస్తున్నామని ప్రతి విషయంలోనూ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం నిర్వహించుకుని ఆ నిర్ణయాల మేరకు చేస్తున్నామని కమిషన్ మెంబర్ కు తెలియజేశారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ శ్రీనివాసులు మాట్లాడుతూ కర్నూలు లో మూడు కాలేజీలు కె.వి.ఆర్ సిల్వర్ జూబ్లీ మరియు గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ లతో క్లస్టర్ యూనివర్సిటీ పనిచేస్తున్నదని తెలియజేశారు ఇందులో పనిచేస్తున్న సిబ్బంది గురించి కమిషన్ మెంబర్ కు తెలియజేశారు. ఈ సమావేశానికి రెక్టర్ ఎన్సికే నాయక్, రిజిస్ట్రార్ విజయకుమార్ నాయుడు డిస్టిక్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ సురేష్ లు పాల్గొన్నారు. యూనివర్సిటీ బోధన సిబ్బంది, భోదనేతర సిబ్బంది విద్యార్థులు మరియు సంఘాల నాయకులు పాల్గొని సమస్యలను మెంబర్ కు విన్నవించారు

